

గత ఐదేళ్లు వైఎస్ జగన్ పాలనలో రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, పంచాయతీరాజ్ వ్యవస్థలు పూర్తిగా సర్వనాశనమయ్యాయి. ఆ ఆక్రోశం, ఆవేదనతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీపై తిరగబడి కూటమికి 94 నుంచి 95 శాతం చారిత్రక విజయాన్ని కట్టబెట్టారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శనివారం 07.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 197 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

చిన్నారి కన్నీటికి.. లోకేశ్ భరోసా



సామాజిక మాధ్యమంలో బాలిక వేడుకోలు

చదువుకు దూరమైన పదో తరగతి విద్యార్థిని

మంత్రి స్పందనతో కదిలిన అధికార యంత్రాంగం

హైదరాబాద్‌కు వెళ్లి తండ్రికి కౌన్సెలింగ్

తిరిగి కేజీబీవీలో చదువుకునేందుకు మార్గం సుగమం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజాప్రతినిధి పనితీరుకు అసలైన కొలమానం పదవులు, ప్రకటనలు, సభల్లో చేసే ప్రసంగాలు మాత్రమే కాదు.. సామాన్య ప్రజల సమస్యల పట్ల చూపే స్పందన, వాటి పరిష్కారానికి తీసుకునే చొరవ. ముఖ్యంగా తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వం అండగా నిలిచినప్పుడు ప్రజాస్వామ్య పాలనపై విశ్వాసం మరింత బలపడుతుంది. నెల్లూరు జిల్లాకు చెందిన ఓ బాలిక ఉదంతంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చూపిన చొరవ ఈ కోణంలో అభినందనీయం. కొండాపురం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కుటుంబ పరిస్థితుల కారణంగా చదువుకు దూరమైంది. తల్లి మరణించిన అనంతరం తండ్రి ఆమెను హైదరాబాద్‌కు తీసుకెళ్లడంతో పాఠశాల విద్య నిలిచిపోయింది. అయితే చదువుకోవాలన్న ఆమె ఆకాంక్ష మాత్రం తగ్గలేదు. తిరిగి పాఠశాలకు వెళ్లి చదువును కొనసాగించాలన్న తన కోరికను సామాజిక మాధ్యమం ద్వారా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లింది.

ఒక విద్యార్థిని నుంచి వచ్చిన ఈ విజ్ఞప్తిని మంత్రి లోకేష్ సాధారణ ఫిర్యాదుగా పరిగణించలేదు. వెంటనే స్పందించి నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి లోకేష్ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కదిలింది. అధికారులు హైదరాబాద్‌కు వెళ్లి బాలిక తండ్రితో మాట్లాడి, కౌన్సెలింగ్ నిర్వహించారు. చివరకు బాలిక తిరిగి కేజీబీవీలో చదువును కొనసాగించేందుకు మార్గం సుగమమైంది.

ఈ ఘటనలో ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అంశం మంత్రి లోకేష్ స్పందించిన వేగం. ఒక బాలిక తన భవిష్యత్తు కోసం చేసిన విజ్ఞప్తి ఆయన దృష్టికి చేరిన వెంటనే సంబంధిత జిల్లా అధికారులను అప్రమత్తం చేయడం, సమస్య పరిష్కారానికి బాధ్యత అప్పగించడం ప్రశంసనీయం. సమస్య ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరి పరిధిలో ఉంది అనే అధికారిక ప్రక్రియల చుట్టూ తిప్పకుండా.. పరిష్కార దిశగా యంత్రాంగాన్ని కదిలించడం ప్రజాప్రతినిధిగా ఆయన చూపిన చొరవను తెలియజేస్తోంది.

స్పందించే నాయకత్వానికి ఇదో ఉదాహరణ: నేటి డిజిటల్ యుగంలో ప్రజలకు తమ సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు సామాజిక మాధ్యమాలు ఒక వేదికగా మారాయి. అయితే ఆ వేదికపై వచ్చే ప్రతి విజ్ఞప్తికి స్పందించడం, సంబంధిత అధికారులకు బాధ్యత అప్పగించడం, పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం

చదువుకోవాలన్న ఆశ ఉంది.. కానీ కుటుంబ పరిస్థితులు అడ్డుగా నిలిచాయి. తల్లి మరణం.. తండ్రితో హైదరాబాద్‌కు పయనం.. మధ్యలోనే ఆగిపోయిన పదో తరగతి చదువు! అయినా చదువుపై ఆశను వదులుకోని ఓ చిన్నారి చేసిన విజ్ఞప్తి మంత్రి నారా లోకేశ్ దృష్టికి చేరింది. అంతే.. క్షణాల్లో అధికార యంత్రాంగం కదిలింది. బాలిక తిరిగి బడిబాట పట్టేందుకు మార్గం సుగమమైంది.

2లో

పొలం బాట పట్టిన సీఎం

- బురద బాటలో సీఎం చంద్రబాబు పర్యటన
- వరద ముంపు పొలాల్లోకి వెళ్లి పంటల పరిశీలన
- పంట నష్టంపై అధికారులతో సమీక్ష
- చివరి బాధితుని వరకు ప్రభుత్వ సాయం



రైతు చెంతకు ముఖ్యమంత్రి

- నీట మునిగిన పొలాల్లో పర్యటించి పరామర్శ
- పంట నష్టాన్ని స్వయంగా పరిశీలించిన చంద్రబాబు
- బాధితులకు అండగా ఉంటామని భరోసా
- సమీక్షలు, పర్యటనలతో నిరంతర పర్యవేక్షణ

గుంటూరు/బాపట్ల, నవంబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను, వరద నీటితో మునిగిన పొలాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం బాపట్ల జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వరకు నడుచుకుంటూ వెళ్లి రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. జిల్లెళ్లమూడి వంతెన వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం అక్కడి నుంచి రేటూరు గ్రామం వరకు కాలినడకన సాగిన ముఖ్యమంత్రి.. దారిపొడవునా రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. మిగతా 2లో...

ప్రతి ఇంటికీ విద్యుత్

- పనుల్లో జాప్యం వద్దు.. వేగం పెంచండి
- మిగిలిన ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరించాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

తక్షణ సాయం అందించండి

- అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ
- వారం వ్యవధిలో రెండు తుఫాన్లతో భారీ నష్టం
- మురసు తుఫానుతో రూ.1,919.59 కోట్ల నష్టం
- మధ్యంతర ఆర్థిక సాయం మంజూరుకు విజ్ఞప్తి

బాలికల ఆరోగ్యంపై అప్రమత్తం

- కురుపాం గురుకులంలో ప్రత్యేక వైద్య శిబిరం
- జ్వరాల బారిన పడిన 71 మంది విద్యార్థినులు
- ఒకరికి మలేరియా నిర్ధారణ
- మిగిలిన బాలికలకు వైద్య పరీక్షల్లో నెగెటివ్
- ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్య శాఖ
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి, నవంబర్ 6: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేట గురుకుల పాఠశాలలో బాలికలకు జ్వరాలు వచ్చిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తుపాను అనంతర పరిస్థితుల నేపథ్యంలో బాలికలకు వైరల్ జ్వరాలు వచ్చి ఉండవచ్చని వైద్యులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆర్. వెంకటరమణ సమర్పించిన నివేదిక ప్రకారం.. మొత్తం 71 మంది బాలికలు జ్వరాల బారినపడగా, వారిలో 30 మంది పూర్తిగా కోలుకున్నారు. ప్రస్తుతం 38 మంది బాలికలు వసతి గృహంలోని ప్రత్యేక గదిలో వైద్య చికిత్స, పర్యవేక్షణలో ఉన్నారు. మరో ముగ్గురిని మెరుగైన వైద్య సేవల కోసం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాలికలందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. మిగతా 2లో...

రైతుకు అండగా ఉంటాం

- రైతుకు భరోసా ఇచ్చిన మంత్రి గొట్టిపాటి
- రూ.500 కోట్లు దాటిన విద్యుత్ శాఖ నష్టం
- 7,500కుపైగా స్తంభాలు నేలకూలిన వైనం
- మూడు రాష్ట్రాల నుంచి 3 వేల మందికిపైగా సిబ్బంది
- శనివారం సాయంత్రానికి 100 శాతం విద్యుత్ పునరుద్ధరణ లక్ష్యం

• వివరాలు 3 లో



నేడు ఓట్ల లెక్కింపు

- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో ఏర్పాట్లు
- 19,885 మంది పోలీసులతో మూడు అంచెల భద్రత
- డ్రోన్లు, సీసీ కెమెరాలతో సున్నిత ప్రాంతాలపై నిఘా
- 70.72 శాతం పోలింగ్ నమోదు

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ రెండో సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం (నవంబర్ 7) ఉదయం 8 గంటల నుంచి



రాష్ట్రవ్యాప్తంగా 365 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఇందుకోసం సుమారు 9,062 లెక్కింపు బల్లలను ఏర్పాటు చేయగా, 11,002 మంది లెక్కింపు పర్యవేక్షకులు, 28,692 మంది లెక్కింపు సహాయకులు, ఇతర సిబ్బందిని నియమించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఈ ఎన్నికల్లో 77 జెడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 577 జెడ్పీటీసీ, 7,707 ఎంపీటీసీ స్థానాలకు నవంబర్ 5న పోలింగ్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 70.72 శాతం పోలింగ్ నమోదైంది. మిగతా 2లో...



గురుకులాల్లో అప్రమత్తత


- శివన్నపేట విద్యార్థుల ఆరోగ్యంపై మంత్రి సమీక్ష
- జ్వరాల వ్యాప్తి నివారణకు తక్షణ చర్యలు
- వైద్య బృందాలతో నిరంతర పర్యవేక్షణ
- ఎక్కడా అలసత్వం వద్దన్న అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం (జర్నలిస్ట్ ఫైల్) : పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేటలోని ఏపిటిడబ్ల్యూఆర్ఎస్, యుఆర్జేసీ గురుకుల వసతి పాఠశాలలో విద్యార్థులకు జ్వరాలు, జలుబు, దగ్గు లక్షణాలు కనిపించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అప్రమత్తమయ్యారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మిగతా 3లో...

ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి

- అమిత్ షాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ లేఖ
- వరుస తుపాన్లతో రాష్ట్రానికి తీవ్ర నష్టం
- మురసు నష్టాల అంచనాకు కేంద్ర బృందాలు పంపాలి
- రైతులకు పరిహారం.. పంటల బీమా త్వరగా అందించాలి

అమరావతి: వరుస తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అక్టోబర్ 26 నుంచి 28 వరకు ప్రభావం చూపిన ఆర్నబ్ తుపాను, నవంబర్ 2 నుంచి 4 వరకు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన మురాసు తుపాను కారణంగా వ్యవసాయం, ఉద్యానవనాలు, మత్స్య, పశు సంవర్ధక, అనుబంధ రంగాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని



లేఖలో వివరించారు.

వరుస తుపాన్ల ప్రభావంతో వేలాది మంది రైతులు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు, పశుపోషకులు తమ జీవనోపాధిని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆర్నబ్ తుపాను నష్టాలను అంచనా వేయడానికి కేంద్ర బృందాలను తక్షణమే పంపించిన కేంద్ర ప్రభుత్వానికి, హోంమంత్రి అమిత్ షాకు కృతజ్ఞతలు తెలిపారు. మిగతా 2లో...

చిన్నారి కన్నీటికి.. లోకేశ్ భరోసా



(మొదటి పేజీ తరువాయి)

నాయకత్వానికి అవసరమైన లక్షణాలు. బాలిక విజ్ఞప్తిపై లోకేష్ స్పందించిన తీరు ఈ బాధ్యతాయుతమైన విధానాన్ని ప్రతిబింబిస్తోంది.

ప్రత్యేకించి విద్యాశాఖ మంత్రిగా విద్యార్థుల సమస్యల పట్ల ఆయన చూపిన శ్రద్ధ ప్రాధాన్యత సంతరించుకుంది. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలు, పరీక్షలు, ఫలితాలకు పరిమితమైన అంశం కాదు. విద్యార్థి చదువుకు ఏదైనా ఆటంకం ఎదురైనప్పుడు దానిని గుర్తించి పరిష్కరించడమూ విద్యా పరిపాలనలో భాగమే. కుటుంబ పరిస్థితుల కారణంగా చదువు మధ్యలో ఆగిపోయే ప్రమాదం ఎదుర్కొన్న బాలికకు తిరిగి విద్యావకాశం కల్పించడంలో మంత్రి చొరవ చూపడం మంచి సంకేతం.

ఆదేశాలకే పరిమితం కాకుండా.. ఫలితం వచ్చేలా చర్యలు : ప్రభుత్వ వ్యవస్థలో సమస్యలు పరిష్కారం కాకపోవడానికి కొన్నిసార్లు అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపం, నిర్ణయాల్లో జాప్యం కారణమవుతుంటాయి. అటువంటి సందర్భాల్లో ప్రజాప్రతినిధుల చొరవ కీలకంగా మారుతుంది. ఈ ఘటనలో మంత్రి లోకేష్ నుంచి వచ్చిన ఆదేశాలతో జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తే సమస్యలకు పరిష్కారం సాధ్యమని నిరూపిస్తోంది.

అయితే బాలిక తిరిగి పాఠశాలలో చేరడమే అంతిమ లక్ష్యం కాకూడదు. ఆమె పదో తరగతి చదువును విజయవంతంగా పూర్తిచేసేలా, తదుపరి విద్యకు అవసరమైన సహకారం అందేలా అధికారులు పర్యవేక్షించాలి. ఈ విషయంలోనూ మంత్రి చొరవ కొనసాగితే బాలిక భవిష్యత్తుకు మరింత భరోసా లభిస్తుంది.

ప్రజల సమస్యలే ప్రాధాన్యంగా ఉండాలి : మంత్రి లోకేష్ జోక్యంతో ఒక బాలికకు తిరిగి చదువుకునే అవకాశం లభించడం చిన్న విషయంగా కనిపించవచ్చు. కానీ ఆ బాలిక జీవితంలో అది కీలకమైన మలుపు. చదువుపై ఆశలు వదులుకోకుండా చేసిన ఆమె ప్రయత్నానికి ప్రభుత్వ స్పందన తోడవడం అభినందించదగిన పరిణామం. ఒక విద్యార్థిని భవిష్యత్తును కాపాడేందుకు మంత్రి చూపిన చొరవ ఇతర ప్రజాప్రతినిధులకు, అధికారులకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలవాలి.

ప్రభుత్వం అంటే కేవలం పాలనా వ్యవస్థ కాదు.. ప్రజల కష్టాలను వినే, అర్థం చేసుకునే, పరిష్కారం చూపే బాధ్యతాయుతమైన యంత్రాంగం. ఆ యంత్రాంగాన్ని సరైన దిశలో నడిపించడమే నాయకత్వం. నెల్లూరు బాలిక ఉదంతంలో నారా లోకేశ్ స్పందన ఈ అంశాన్ని మరోసారి గుర్తుచేసింది.

లిఒక బాలిక ఆవేదనను ఆలకించి, అధికారులను కదిలించి, ఆమెను తిరిగి బడిబాట పట్టించేలా చేసిన మంత్రి నారా లోకేశ్ చొరవ అభినందనీయం. ప్రజల సమస్యలు తన దృష్టికి వచ్చినప్పుడు స్పందించే నాయకత్వమే ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది. పదవికి విలువ తెచ్చేది అధికారం కాదు.. ఆ అధికారంతో ఒకరి జీవితంలో తీసుకురాగల సానుకూల మార్పు.

ప్రతి ఇంటికీ విద్యుత్



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : మురసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చివరి ఇంటి వరకు వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు.

మురసు తుఫాన్ గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపడంతో ఆయా జిల్లాల్లో 7,500కు పైగా విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ఏపీసీపీడీసీఎల్ సిబ్బంది విస్తృతంగా మరమ్మతు పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డితో విద్యుత్ వ్యవస్థకు జరిగిన నష్టం, పునరుద్ధరణ పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాపట్ల జిల్లాలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని సీఎండీ ముఖ్యమంత్రికి వివరించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం నిరంతరం శ్రమిస్తున్న సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ పనులను వేగవంతం చేసి, ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)



అదే విధంగా మురాసు తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కూడా వెంటనే కేంద్ర బృందాలను పంపించాలని విజ్ఞప్తి చేశారు. రెండు తుపాన్ల వల్ల జరిగిన ఉమ్మడి నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని రాష్ట్రానికి ప్రత్యేక కేంద్ర ఆర్థిక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. బాధిత రైతులకు తక్షణ పరిహారం, వ్యవసాయ పెట్టుబడి రాయితీలు అందించడంతోపాటు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద బీమా పరిహారాన్ని త్వరితగతిన విడుదల చేయాలని సూచించారు. ఉద్యానవనాలు, మత్స్య, ఆక్వాకల్చర్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమలకు కూడా తగిన పునరావాస సహాయం అందించాలని కోరారు.

తుపాన్ల కారణంగా దెబ్బతిన్న రహదారులు, సాగునీటి వసతులు, విద్యుత్, తాగునీటి సరఫరా వ్యవస్థలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహకారం అందించాలని లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలతోపాటు ముఖ్యంగా రైతాంగం, గ్రామీణ ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర సహాయ ప్యాకేజీ మంజూరు చేయాలని అమిత్ షాను కోరినట్లు పీవీఎన్ మాధవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, రైతుల జీవితాల్లో తిరిగి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పొలం బాట పట్టిన సీఎం



(మొదటి పేజీ తరువాయి)

మధ్యమధ్యలో పొలాల వద్ద ఆగుతూ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పంట కాలువ గట్లు, పంట బోదెలపై నడుచుకుంటూ వెళ్లి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. రైతులు పెట్టిన పెట్టుబడులు, పంట దిగుబడి అంచనాలు, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లెళ్లమూడి వంతెన వద్ద వరద ప్రవాహ ఉధృతిని పరిశీలించిన ముఖ్యమంత్రికి వాగు ఉధృతి కారణంగా చుట్టుపక్కల ప్రాంతాలు నీట మునిగిన తీరును రైతులు, అధికారులు వివరించారు. జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వెళ్లే మార్గంలో పలు చోట్ల కోతకు గురైన రహదారిని పరిశీలించారు. నల్లమడ వాగు గేట్లు దెబ్బతిన్నాయని, వాటి కారణంగా నీటి నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం దెబ్బతిన్న గేట్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైతే కొత్త గేట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నల్లమడ డ్రెయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. పంట పొలాల్లోకి వరద నీరు చేరకుండా నియంత్రించడంతోపాటు, వరద వచ్చినప్పుడు వచ్చే నీటిని సద్వినియోగం చేసుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

రైతులు పడిన కష్టానికి ఫలితం దక్కేలా పని చేస్తున్నాం : రేటూరు గ్రామంలో నడుచుకుంటూ వెళ్లిన ముఖ్యమంత్రి... వరద నీటిలో మునిగిపోయిన వరి చేలను పరిశీలించారు. పొలం గట్లపై నడుస్తూనే రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందడంతో పంటలు సాగు చేశామని, మంచి దిగుబడి వస్తుందని ఆశించిన సమయంలో తుఫాన్ వచ్చి తీవ్రంగా నష్టపరిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కోసం ఎంత పెట్టుబడి పెట్టారు? పంటల బీమా చేయించుకున్నారా? అనే విషయాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంటల బీమా, ప్రభుత్వ ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అండగా నిలుస్తాయని వివరించారు. పంటల బీమాపై రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తుఫాన్ల ముప్పు తగ్గేలా సాధారణ సాగు సీజన్ కంటే ముందుగానే నీరు అందించి పంటలు వేసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ముందస్తు సాగుకు మరింత అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రేటూరులో రైతులు, ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్లు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పట్టిసీమ ద్వారా సాగునీరు అందించడంతో పంటలు సాగు చేశారని, మంచి దిగుబడులు వచ్చే సమయంలో మురసు తుఫాన్ నష్టాన్ని మిగిల్చిందని చెప్పారు. ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నష్టాన్ని చాలావరకు నివారించగలిగామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై మురసు తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిందన్నారు. తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రజలు వాటిని తేలిగ్గా తీసుకోవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముందస్తు చర్యలతో నష్ట నివారణ... వేగంగా పునరుద్ధరణ : తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నామని, చివరి బాధితుడికి సాయం అందే వరకు ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులకు నష్టపోయిన పెట్టుబడిలో కొంత మేర ఉపశమనం కలుగుతుందని చెప్పారు. రైతుల పంట నష్టం అంచనాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని... రైతులకు ఫోన్ల ద్వారా సమాచారం అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులతోనూ మాట్లాడి కాలువలు, తూముల్లో పేరుకుపోయిన కంప, ఇతర అడ్డంకులను తొలగిస్తున్నారా అని ఆరా తీశారు. నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్నబ్ తుఫాన్ కారణంగా నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించామని, మురసు తుఫాన్ వల్ల మరో 10 వేల స్తంభాలు దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను కూడా త్వరితగతిన పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. తుఫాన్ సహాయక చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సహకారం తీసుకుంటున్నామని వెల్లడించారు. తుఫాన్ల ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించామని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు.

ఓ పక్క తుఫాన్లు... మరో పక్క ఎల్ నినో : రాష్ట్రంలోని తీర ప్రాంతాలను వరుస తుఫాన్లు ఇబ్బందులకు గురిచేస్తుంటే, రాయలసీమ ప్రాంతం ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులను ఎదుర్కొంటోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాయలసీమలో కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందాలు కూడా పర్యటించాయని తెలిపారు. ఒకవైపు తీర ప్రాంతాల్లో నీరు వృథాగా సముద్రంలో కలుస్తుంటే, మరోవైపు రాయలసీమలో నీటి కొరత నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. వరద నీటిని సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగిందని ముఖ్యమంత్రి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో తుఫాన్లు వచ్చినప్పుడు రెడ్ కార్పెట్ వేసుకుని పంటలను పరిశీలించి, పరామర్శించేవారన్నారు. తాము స్థానిక సంస్థల ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యత ఇచ్చి తుఫాన్ సమయంలో సహాయక చర్యలను వేగవంతం చేశామని తెలిపారు. ఎన్నికల సమయంలోనే రెండు తుఫాన్లు వచ్చాయని... అయినా ఎన్నికలపై దృష్టి పెట్టకుండా...ప్రజలకు ఇబ్బందులు పరిష్కరించేందుకే ప్రాధాన్యత ఇచ్చామని... నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉన్నామని ముఖ్యమంత్రి చెప్పారు. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారని, పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత అన్ని అంశాలపై మాట్లాడతానని చెప్పారు. అంతకుముందు జిల్లెళ్లమూడి గ్రామానికి చేరుకున్న ముఖ్యమంత్రిని అమ్మ భక్తులు కలిశారు. వారు గ్రామంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ముఖ్యమంత్రి అభినందించారు. అలాగే అమరావతి నుంచి ఏరియల్ సర్వే చేసుకుంటూ సీఎం చంద్రబాబు సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, వేగేశ్న నరేంద్ర వర్మ, ఏలూరి సాంబశివరావు, రెండు జిల్లా కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైతు చెంతకు ముఖ్యమంత్రి

అమరావతి, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) : సచివాలయంలో సమీక్షలే కాదు పొలం గట్లపైకి, పంట బోదెల మీద తిరుగుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తుఫాను నష్టాన్ని స్వయంగా చూసి తెలుసుకున్నారు. రైతన్న కష్టానికి కదిలి.. పొలం గట్లపైకి ముఖ్యమంత్రి వెళ్లారు. తుఫాను వల్ల నష్ట పోయిన అన్నదాతకు అండగా నిలిచేలా రాత్రిళ్లు సైతం సమీక్షలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పర్యటించారు. తుఫాను వల్ల కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగిన రైతుల కష్టాన్ని కళ్లారా చూసేందుకు ధ్వంసమైన రహదారుల్లోనూ, ముంపు ప్రాంతాల్లోనూ పర్యటించారు. అక్టోబరు 27 తేదీ నుంచి నిరంతరాయంగా ప్రజల్ని నిరంతరం అప్రమత్తం చేస్తూ.. క్షేత్రస్థాయిలో రైతుల కష్టాల్ని తెలుసుకుంటూ ముంపు ప్రాంతాల ప్రజలకు అండగా నిలిచారు. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా పర్యవేక్షణతో పాటు నేల కొరిగిన చెట్లను తక్షణమే తొలగించేలా యంత్రాంగాన్ని నడిపించి సంక్షోభ నివారణలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకున్నారు. నెలల తరబడి కష్టపడి, అప్పులు చేసి, ఆశలతో సాగు చేసిన పంట నష్ట పోతే అన్నదాతకు ఎంత కష్టమో రైతుకే తెలుసు. అలాంటి కష్ట కాలంలో రైతుకు ధైర్యం చెప్పేందుకు, వారి కన్నీళ్లు తుడిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పొలం గట్లపైకి నడిచారు. నీట మునిగిన చేల మధ్యకు వెళ్లారు. పంట బోదెల వద్ద నిలబడి పంట నష్టాన్ని పరిశీలించారు. రైతుల పక్కన నిలబడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.



తుఫాను నష్టం ఎక్కడుంటే.. అక్కడికి సీఎం : అర్నబ్ తుఫాను సమయంలో కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన నుంచి పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం వరకు ముఖ్యమంత్రి పర్యటించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. తాజాగా మురసు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోనూ పర్యటించారు. బాపట్ల జిల్లాలోని జిల్లెళ్లమూడి, గుంటూరు జిల్లాలోని రేటూరులో నీట మునిగిన వరి పొలాల వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. పొలం గట్లపై నడుస్తూ, పంట బోదెలను చూస్తూ రైతుల ఆవేదనను ఆలకించారు. అధికారుల నివేదికలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. పంట నష్టాన్ని చూసి రైతులు పడుతున్న ఆవేదనను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో పంట దెబ్బతింది.. ఎంత నష్టం వాటిల్లింది. రైతులకు తక్షణం అందించాల్సిన సాయం తదితర అంశాలను వారినే అడిగి తెలుసుకున్నారు. కష్టపడి పండించిన పంటను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తు రైతును కుంగదీయకుండా, తిరిగి వ్యవసాయం చేసుకునేలా సహకారం అందించాలన్న దిశగా అధికారులకు సూచనలు చేశారు.

రైతులు, ప్రజల కోసం రాత్రి పగలు అప్రమత్తం : తుఫాను తీరం దాటిన తర్వాతే కాదు.. ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటి నుంచే ముఖ్యమంత్రి అప్రమత్తమయ్యారు. అక్టోబరు 27 నుంచే ఆర్నబ్ తుఫాను ప్రభావంపై వరుస సమీక్షలు నిర్వహించారు. ముందస్తు హెచ్చరికలు జారీ చేయించి, అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. మురసు తుఫాను సమయంలోనూ రాత్రిళ్లు సైతం మేల్కొని టెలి కాన్ఫరెన్సుల ద్వారా కలెక్టర్లు, ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ పరిస్థితులు, వర్షాల తీవ్రత, ముంపు ప్రాంతాలు, ప్రజల తరలింపు, సహాయక చర్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించారు. విపత్తు సమయంలో రాష్ట్ర యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వంతోనూ నిరంతరం సంప్రదింపులు జరిపారు. నష్టతీవ్రతను అంచనా వేయడం, బాధితులకు సాయం అందించడం, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయడంపై దృష్టి సారించారు. ఒకవైపు ఉన్నతాధికారులతో సమీక్షలు..మరో వైపు క్షేత్రస్థాయి పర్యటనలు.. ఇంకోవైపు ప్రజలను అప్రమత్తం చేస్తూ విపత్తు నిర్వహణను సమన్వయంతో ముఖ్యమంత్రి ముందుకు అడుగు వేశారు.

బాలికల ఆరోగ్యంపై అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

ఒకరికి మలేరియా పాజిటివ్ : గురుకుల పాఠశాలలో మొత్తం 559 మంది బాలికలు ఉండగా, వారిలో 516 మంది ప్రస్తుతం పాఠశాలకు హాజరయ్యారు. వీరందరికీ ర్యాపిడ్ డయాగ్నస్టిక్ పరీక్షలు నిర్వహించగా, ఒక బాలికకు ప్లాస్మోడియం ఫాల్సిపారం మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మిగిలిన 515 మందికి నెగెటివ్‌గా వచ్చింది. జ్వరాల బారినపడిన బాలికల్లో 44 మందికి నిర్వహించిన జ్వరం సంబంధిత పరీక్షల ఫలితాలు సాధారణంగా వచ్చాయి. మరింత సమగ్ర నిర్ధారణ కోసం రక్త నమూనాలను ప్రయోగశాలలకు పంపించారు.



ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు : నవంబర్ 6న జనరల్ మెడిసిన్, పిల్లల వైద్య నిపుణులతో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు బాలికలను క్షుణ్ణంగా పరీక్షించి అవసరమైన చికిత్స అందిస్తున్నారు. క్లినికల్ పరిశీలన ఆధారంగా తుపాను అనంతర పరిస్థితుల్లో వైరల్ జ్వరాలు వచ్చి ఉండవచ్చని వైద్యులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. బాలికలకు అవసరమైన మందులు, వైద్య సేవలు అందించడంతోపాటు వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.


నీటి నమూనాల పరీక్షలు : వసతి గృహంలోని మూడు వేర్వేరు నీటి వనరుల నుంచి నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపించారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ అధికారులు నవంబర్ 6న అదనపు నీటి నమూనాలను కూడా సేకరించారు. వసతి గృహంలో రెండు ఆర్ఓ ప్లాంట్లు ఉండగా, వాటిలో ఒకటి ప్రస్తుతం మరమ్మతులో ఉంది. దీంతో బాలికలకు కాచి చల్లార్చిన నీటిని అందిస్తున్నారు. వంటశాల, వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. నీటి పరీక్షల్లోనూ సాధారణ ఫలితాలు వచ్చినట్లు వెల్లడించారు.

ఇతర ప్రాంతాల్లో జ్వరాలు లేవు : గురుకుల వసతి గృహానికి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న కురుపాం గ్రామంలో జ్వరం కేసులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాలికల ఆరోగ్య పరిస్థితి కూడా నిలకడగా ఉందని పేర్కొన్నారు.

అన్ని వసతి గృహాల్లో అప్రమత్తత : జిల్లాలోని అన్ని గురుకుల, వసతి గృహ పాఠశాలల్లో జ్వరాలపై నిరంతర నిఘా ఉంచాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించింది. విద్యార్థినులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని, జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించాలని సూచించింది. అవసరమైన చోట ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి పరిస్థితిని సమీక్షించాలని స్పష్టం చేసింది.

బాలికలకు నిరంతరం వైద్య సేవలు అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. పరిస్థితులు పూర్తిగా అదుపులోనే ఉన్నాయని, వైద్య శిబిరాన్ని కొనసాగిస్తూ బాలికలకు అవసరమైన అన్ని వైద్య సేవలు అందిస్తున్నామని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆర్. వెంకటరమణ తెలిపారు.

తక్షణ సాయం అందించండి



అమరావతి, నవంబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్) : వరుస తుఫాన్లతో ఆంధ్రప్రదేశ్‌కు భారీ నష్టం వాటిల్లిందని, మురసు తుఫాన్ కారణంగా ప్రాథమికంగా రూ. 1,919.59 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి వివరించారు. తుఫాను నష్టం నుంచి ఉపశమనం కోసం తక్షణం మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ రాశారు. వారం రోజుల వ్యవధిలోనే రెండు వరుస తుఫాన్ల కారణంగా ఏపీపై తీవ్ర ప్రభావం పడిందని సీఎం పేర్కొన్నారు. భారీ వర్షాలు, తీవ్ర గాలుల కారణంగా విద్యుత్, రహదారుల లాంటి మౌలిక సదుపాయాలు ధ్వంసం అయ్యాయని వివరించారు. అక్టోబరు 27 తేదీన అర్నబ్ తుఫాను వల్ల జరిగిన నష్టం నుంచి రాష్ట్రం కోలుకుంటున్న సమయంలోనే మురసు తుఫాన్ విరుచుకు పడటంతో రైతులు, మత్స్యకారులు ఒకే సీజన్‌లో రెండుసార్లు నష్టపోయారని తెలిపారు. వరద నీరు తగ్గిన తర్వాత నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలు నిర్వహించి మరో 15 రోజుల్లో సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు.

తక్షణ సాయంతో రాష్ట్రానికి ఉపశమనం : మురసు తుఫాన్ కారణంగా వ్యవసాయ రంగంలో 1,43,122 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, 1,86,063 మంది రైతులు ప్రభావితం అయ్యారని ముఖ్యమంత్రి కేంద్ర హోం మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ. 874.96 కోట్ల నష్టం వాటిల్లిందని... ఉద్యాన పంటలు 6,504.38 హెక్టార్లలో దెబ్బతినగా, 12,178 మంది రైతులు నష్ట పోయారని తెలిపారు. ఈ రంగానికి రూ. 337.10 కోట్ల నష్టం జరిగిందని వివరించారు. దీంతో పాటు పశుసంవర్ధక, ఆక్వా, గృహ నిర్మాణం, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, విద్య, వైద్యారోగ్య శాఖల్లో తీవ్రంగా నష్టం వాటిల్లిందని కేంద్ర హోం మంత్రికి రాసిన లేఖలో తెలిపారు. ముందస్తు చర్యలు తీసుకోవడంతో కొంత మేర ఆస్తి నష్టాన్ని తగ్గించ గలిగామని వివరించారు. మురసు తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, గృహాలు దెబ్బతిన్న కుటుంబాలు, ఇతర బాధిత వర్గాలను ఆదుకోవడానికి, రాష్ట్రంలో దెబ్బతిన్న అత్యవసర మౌలిక సదుపాయాలు, సేవలను పునరుద్ధరించడానికి కేంద్ర హోం శాఖ తక్షణమే మధ్యంతర ఆర్థిక సాయం మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు. కేంద్రం నుంచి తక్షణ సహాయం అందితే బాధితులకు ఉపశమనం కల్పించడంతోపాటు రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోగలమని స్పష్టం చేశారు.

నేడు ఓట్ల లెక్కింపు

(మొదటి పేజీ తరువాయి)

2021 ఎన్నికల్లో నమోదైన 60.91 శాతం పోలింగ్‌తో పోలిస్తే ఈసారి 9.81 శాతం అధికంగా నమోదైందని కమిషనర్ తెలిపారు. బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ పెట్టెల ధ్వంసం వంటి ఘటనల నేపథ్యంలో అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో శుక్రవారం రీపోలింగ్ నిర్వహించగా, పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు.

కౌంటింగ్‌లో తొలుత పోస్టల్ బ్యాలెట్లను, అనంతరం బ్యాలెట్ పెట్టెల్లోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్లను లెక్కిస్తారు. మొత్తం లెక్కింపు బల్లల్లో 50 శాతం జెడ్పీటీసీ, మిగిలిన 50 శాతం ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు కేటాయించారు. ప్రతి బల్లకు ఒక్కో రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను అందజేసి లెక్కింపు చేపడతారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా లెక్కింపు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల కమిషనర్ తెలిపారు.

మరోవైపు కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఐజీ బి. రాజకుమారి వెల్లడించారు. మొత్తం 365 కౌంటింగ్ కేంద్రాల వద్ద 19,885 మంది పోలీసులతో మూడు అంచెల భద్రత కల్పిస్తున్నారు. వీరిలో 135 మంది డీఎస్పీలు, అదనపు ఎస్పీలు, 572 మంది ఇన్‌స్పెక్టర్లు, 1,412 మంది ఎస్సైలు, 14,877 మంది అదనపు ఎస్సైలు నుంచి కానిస్టేబుళ్ల వరకు, 2,889 మంది హోంగార్డులు ఉన్నారు. సున్నిత ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, పోలీసుల బాడీ వోర్న్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఐజీ కోరారు.

గురుకులాల్లో అప్రమత్తత



(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.
విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.
గురుకుల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగించాలని, వైద్య నిపుణులతో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, ఇతర విద్యార్థులకు ఇన్ఫెక్షన్లు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.
తాగునీటి నాణ్యత, ఆహార పదార్థాల స్వచ్ఛత, వంటశాల పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జ్వరాల వ్యాప్తికి గల కారణాలను గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, నివేదికల ఆధారంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు.
శివన్నపేట గురుకులంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా అన్ని గురుకుల, సంక్షేమ వసతి పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఎక్కడైనా జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే స్పందించి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు.
విద్యార్థుల ఆరోగ్య భద్రత విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించరాదని, పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు వైద్య బృందాలు నిరంతరం అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు తల్లిదండ్రుల్లో ఆందోళన తొలగించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

రైతుకు అండగా ఉంటాం




అద్దంకి(జర్నలిస్ట్ ఫైల్) : అర్నబ్, మురసు తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో ప్రతి రైతు, ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శనివారం సాయంత్రానికి 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడమే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు తెలిపారు. రెండు తుపాన్ల కారణంగా విద్యుత్ శాఖకు రూ. 500 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని వెల్లడించారు.
మంత్రి శుక్రవారం అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి తుపాను నష్టాన్ని పరిశీలించారు. జె.పంగులూరు మండలంలోని ముప్పవరం, కొండమంజులూరు, కోటపాడు, జనకవరం, తూర్పు తక్కెళ్లపాడు, అలవలపాడు గ్రామాలతో పాటు కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు, కొరిశపాడు, కుర్రావానిపాలెం, రావినూతల గ్రామాలను సందర్శించారు. అనంతరం సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు.
ముప్పవరంలో దెబ్బతిన్న మామిడి తోటలను, కొండమంజులూరులో ధ్వంసమైన నర్సరీని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కోటపాడులో కూలిన ఇళ్లు, పశువుల కొట్టాలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. తూర్పు తక్కెళ్లపాడులో పొలాల్లో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను చూశారు. తుపాను నష్టంపై బాధితులను అడిగి తెలుసుకున్నారు.
పొగాకు సహా పలు పంటలకు నష్టం : తుపాను ప్రభావంతో మొక్కజొన్న, అరటి, బొప్పాయి, ఉసిరి, మామిడి తోటలు దెబ్బతిన్నాయని మంత్రి తెలిపారు. సంతనూతలపాడు, అద్దంకి, ఒంగోలు పరిసర ప్రాంతాల్లో పొగాకు పంటకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ప్రకాశం జిల్లాలో పొగాకు బ్యార్నీలు కూడా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పంట నష్టం అంచనాలను వేగంగా పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ నష్టాన్ని నమోదు చేయాలన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా పారదర్శకంగా అంచనాలు రూపొందించాలని స్పష్టం చేశారు.
విద్యుత్ శాఖకు రూ.500 కోట్ల నష్టం : అర్నబ్ తుపాను సమయంలో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో, మురసు తుపాను సమయంలో 120 కిలోమీటర్లకుపైగా వేగంతో గాలులు వీచాయని మంత్రి వివరించారు. దీంతో విద్యుత్ లైన్లు, కండక్టర్లు తెగిపోవడంతో పాటు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. మురసు తుపాను కారణంగానే 7,500కుపైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని చెప్పారు. ఇళ్లు, పంటలు, ఇతర ఆస్తులకు కూడా భారీగా నష్టం వాటిల్లిందన్నారు.
శనివారం నాటికి పూర్తిస్థాయిలో సరఫరా : విద్యుత్ పునరుద్ధరణ పనులను ప్రాధాన్య క్రమంలో చేపడుతున్నట్లు గొట్టిపాటి తెలిపారు. గోదావరి జిల్లాల్లో తుపాను ప్రభావిత ప్రాంతాలకు గురువారం సాయంత్రానికే పూర్తిస్థాయిలో సరఫరా పునరుద్ధరించామన్నారు. ప్రకాశం, గుంటూరు పరిసర ప్రాంతాల్లోనూ పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. వర్షాలు తగ్గినప్పటి నుంచి విద్యుత్ సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తున్నారని, అప్పటికి 70 శాతం సరఫరాను పునరుద్ధరించినట్లు వివరించారు. ఒంగోలు, చిలకలూరిపేట, నరసరావుపేట, అద్దంకి పట్టణాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పూర్తయిందన్నారు. మిగిలిన ప్రాంతాల్లో మండల కేంద్రాల నుంచి గ్రామాల వరకు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో 24 గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో ముందుగా గృహ వినియోగదారులకు సరఫరా అందించి, ఆ తర్వాత వ్యవసాయ, ఆక్వా రంగాలకు పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. శనివారం సాయంత్రానికి తుపాను ప్రభావిత ప్రాంతాలన్నింటికీ విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.
మూడు రాష్ట్రాల నుంచి 3 వేల మందికిపైగా సిబ్బంది : విద్యుత్ పునరుద్ధరణకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి మూడు వేల మందికిపైగా సిబ్బంది వచ్చి సేవలందిస్తున్నారని మంత్రి తెలిపారు. సంతనూతలపాడు మండలం నిడమానూరులో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల సిబ్బందిని కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలవలపాడులో స్తంభాలను తిరిగి నిలబెట్టే పనుల్లో ఉన్న కర్ణాటకలోని బళ్లారి సిబ్బందితో, నిడమానూరు వద్ద పనిచేస్తున్న తమిళనాడు సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. పునరుద్ధరణ పనుల్లో ఉన్న సిబ్బందికి నాణ్యమైన భోజనం, వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సిబ్బంది ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి సిబ్బందిని రప్పించారని తెలిపారు. విపత్కర సమయంలో సహకరించిన మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విద్యుత్ శాఖ మంత్రులు, సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.
అర్నబ్, మురసు తుపాన్ల వల్ల జరిగిన నష్టంపై ప్రాథమిక నివేదికను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేసినట్లు మంత్రి తెలిపారు. పంటలు, ఆస్తులు, విద్యుత్ వ్యవస్థతో పాటు ఇతర రంగాలకు జరిగిన నష్టంపై మరో రెండు రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పిస్తామన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు, బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరిహారం, సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కర్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో భారీ అగ్నిప్రమాదం



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైలు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పంజాబ్‌లోని పాటియాలా జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ప్రయాణిస్తున్న కర్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజన్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకొని నాలుగు బోగీలు మంటల్లో చిక్కుకున్నాయి. సకాలంలో గుర్తించడంతో ప్రయాణీకులందరూ రైలు దిగేశారు. వారందరిని సురక్షి?తంగా బయటకు తీసుకొచ్చిన సహాయక సిబ్బంది అంబాలాకు తరలించారు. నార్తర్న్ రైల్వే అంబాలా డివిజన్ రైల్వే మేనేజర్ వినోద్ భాటియా తెలిపిన వివరాల ప్రకారం..12508 నంబరు గల రైలు అమృత్‌సర్ నుండి పశ్చిమ బెంగాల్‌లోని న్యూ జల్పాయిగురికి వెళ్తుండగా, రాజ్‌పురా స్టేషన్‌కు సమీపాన ఈ ప్రమాదం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో సరాయ్ బంజారా గ్రామం సమీపంలో బోగీ నంబర్ 1లో మొదట మంటలు కనిపించాయి. ఆ సమయంలో రైలులో సుమారు 1,500 మంది ప్రయాణికులు ఉన్నారు. మంటలను గుర్తించిన వెంటనే లోకో పైలట్, గార్డ్, ఇతర రైల్వే సిబ్బంది వెంటనే స్పందించి, ప్రభావితమైన కోచ్‌ను మిగిలిన కోచ్‌ల నుండి వేరు చేశారు. ప్రభావితమైన మూడు కోచ్‌లలోని సామాను పూర్తిగా దెబ్బతిన్నది. సరాయ్ బంజారా గ్రామం సమీపంలో రైలును వెంటనే నిలిపివేసి, ప్రయాణికులను సురక్షితంగా బయటకు తరలించారు. మంటలను ఆర్పివేసేలోపే, అవి నాలుగు కోచ్‌లకు వ్యాపించాయి. మంటలను గమనించిన ప్రయాణీకుల్లో కొందరు భయంతో కదులుతున్న రైలు నుండి దూకడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో ఇద్దరుముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. అగ్నిమాపక దళం రాకముందే గ్రామస్థులు ప్రయాణికులకు సహాయం చేయడానికి వచ్చారని వారు తెలిపారు. ప్రయాణికుల భద్రతను నిర్ధారించడానికి మరియు భయంతో ఎవరూ కోచ్‌ల నుండి దూకకుండా నిరోధించడానికి ముందుజాగ్రత్త చర్యగా ట్రాక్‌కు ఇరువైపులా రైలు రాకపోకలను నిలిపివేశారని భాటియా చెప్పారు. పాటియాలా డిప్యూటీ కమిషనర్ డాక్టర్ హిమాన్ష్ అగర్వాల్, ఎస్ఎస్పి హర్మన్‌దీప్ హన్స్ కూడా అగ్నిప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. రాజ్‌పురా ఎస్‌పి, డిఎస్‌పిలతో పాటు ప్రభుత్వ రైల్వే పోలీసులు (జిఆర్‌పి), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) లతో కూడిన పోలీసు బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్లలో పాలుపంచుకున్నాయని హర్మన్‌దీప్ హన్స్ తెలిపారు. పరిస్థితి ఇప్పుడు పూర్తిగా అదుపులోకి వచ్చిందని ఆయన చెప్పారు. ప్రమాదాలు జరిగిన ప్రతి సారీ.. 'కవచ్' వ్యవస్థతో అత్యుత్తమ భద్రత కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గొప్పలు ప్రచారం చేసుకుంటోంది. కానీ రైల్వేలో ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు. ఎక్కడోఒకచోట ఏదో రూపంలో రైళ్లు ప్రమాదాలకు గురౌతూనేవున్నాయి. కొన్ని ఘటనల్లో ప్రాణనష్టం కూడా ఉంటోంది. రైల్వే భద్రతపై ఇప్పటికైనా మాటల గొప్పలు కాకుండా..పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టెన్నిస్ పాలకమండలికి సానియా, భూపతి ఎంపిక



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్(ఎఐటిఎ) పాలక మండలి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా భారత దిగ్గజ ప్లేయర్లు సానియా మీర్జా, మహేష్ భూపతి ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో భూపతికి అత్యధికంగా 23 ఓట్లు రాగా.. సానియా మీర్జాకు 18 ఓట్లు దక్కాయి. జానకి కృష్ణమూర్తికి 13 ఓట్లు, విశాల్ ఉప్పల్‌కు ఏడు ఓట్లు లభించాయి. దీనికి ముందు జరిగిన జనరల్ బాడీ పదవికి భూపతి, మీర్జాలకు 19, 18 చొప్పున ఓట్లు రావడంతో ఎస్‌ఓఎమ్ ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. వీరితో పాటు అశుతోష్ సింగ్ (17 ఓట్లు), షాలిని ఠాకూర్ చావ్లా (16 ఓట్లు) కూడా ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. జనరల్ బాడీ ఎన్నికల్లో పోటీ చేసిన ఇతర అభ్యర్థులు జానకి కృష్ణమూర్తి (15), విశాల్ ఉప్పల్ (9), గౌరవ్ నాటేకర్ (8) మరియు అంకిత బాంబ్రి (7) చొప్పున ఓట్లు వచ్చాయి.

సాయం చేయబోతే.. ప్రాణాలే బలైపోయాయి !



ఛండీగఢ్ (జర్నలిస్ట్ ఫైల్) : జార్ఖండ్‌లోని కుంతి జిల్లాలో గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మొదట ఓ వ్యక్తి స్కూటరుపై వెళ్లుండగా.. అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయారు. ఇది గమనించిన స్థానికులు అతనికి సాయం చేయడానికి పరుగులు తీశారు. కొందరు అతడిని కాపాడేందుకు యత్నిస్తుండగా..వారితో పాటు వెళ్లిన మహిళలు, చిన్నారులు రోడ్డు పక్కన నిలబడి గమనిస్తున్నారు. ఇదే సమయంలో రోడ్డుపై అతివేగంతో వచ్చిన 18 చక్రాల భారీ ట్రక్కు నిలబడిన వారిపైకి దూసుకెళ్లింది.
ఆ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మృతి చెందిన వారిలో నలుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సాయం కోసం వెళ్లి ఇలా ప్రాణాలు కోల్పోవడంతో స్థానిక ప్రజానీకాన్ని తీవ్రంగా కలిచివేసింది. జిల్లా అంతటా విషాద ఛాయలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. కర్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే క్రాసింగ్ సమీపంలో గురువారం రాత్రి సుమారు 10.15 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు కుంతి జిల్లా ఎస్పీ రిషభ్ గార్గ్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఆయన ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన అత్యంత విషాదకరమని, హృదయవిదారకమని పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..తొలుత ఓ వ్యక్తి స్కూటర్‌పై వెళ్తూ అదపు తప్పి రోడ్డు పక్కన పొదల్లో పడిపోయాడు. స్థానికులు గమనించి సాయం చేసేందుకు తమ ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. కొందరు యువకులు పొదల్లో పడిపోయిన వ్యక్తిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. మరోవైపు మహిళలు, పిల్లలు రోడ్డు పక్కన నిలబడి అక్కడ జరుగుతున్న దృశ్యాన్ని గమనిస్తున్నారు. అదే సమయంలో తోర్ప వైపు నుంచి అతివేగంగా వచ్చిన 18 చక్రాల భారీ వాహనం అక్కడ గుమిగూడిన వారిని ఢీకొట్టింది. ట్రక్కు వేగంగా రావడంతో అక్కడున్న వారికి ప్రమాదాన్ని గుర్తించి పక్కకు తప్పుకునే అవకాశం కూడా దక్కలేదు. వాహనం ఢీకొనడంతో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.
కాగా ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. బిర్సా నాయక్ భార్య కసిలా దేవి, కుమార్తె అంజలి కుమారి, ఏడాది వయసున్న మనవడు సౌరభ్ నాయక్ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దాంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. అలాగే ప్రమాదంలో మరణించిన వారిని కసిలా దేవి, మందు దేవి, అంజలి కుమారి, పాకో దేవి, తుతి కుమారి, గోలు కుమార్, చిన్నారి సౌరభ్ నాయక్‌గా గుర్తించారు. ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరిని కుంతి సదర్ ఆసుపత్రి, తోర్ప కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడ వారికి చికిత్స అందిస్తున్నారు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కు డ్రైవర్, సహాయకుడు అక్కడి నుంచి పరారయ్యారు. వారిని గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన 18 చక్రాల వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోంది.

అగ్రిగోల్డ్ బాధితుల ఒరిజినల్ బాండ్ల పరిశీలన



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలోని అగ్రిగోల్డ్ డిపాజిటర్లు, బాధితులు, నామినీలు, ఏజెంట్ల వద్ద ఉన్న ఒరిజినల్ అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలన కార్యక్రమాన్ని మండలాల వారీగా నిర్వహించనున్నట్లు ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెనుగంచిప్రోలు మండలంలో ఈ నెల 9 నుండి 16 వరకు, వత్సవాయిలో 17 నుండి 30వ తేదీ వరకు బాండ్లను పరిశీలిస్తారన్నారు. నందిగామలో డిసెంబర్ 1 నుంచి 11వ తేదీ వరకు, ఇబ్రహీంపట్నంలో 17 నుండి 31 వరకు బాండ్ల పరిశీలన ఉంటుందన్నారు. జగ్గయ్యపేట మండలంలో వచ్చే ఏడాది జనవరి 1 నుండి 17వ తేదీ వరకు, విజయవాడ రూరల్ మండలంలో అదే నెల 18 నుండి 31 వరకు పరిశీలిస్తారన్నారు. విజయవాడ అర్బన్ మండలంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు బాండ్ల పరిశీలన జరుగుతుందని వెల్లడించారు. బాండ్లను ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విజయవాడలోని ప్రాంతీయ సీఐడీ కార్యాలయం (పెనమలూరు మండలం కానూరు 3వ రోడ్డు, తులసి నగర్, రియా ఆర్థోపెడిక్ ఆసుపత్రి సమీపంలో) వద్ద పరిశీలిస్తారని తెలిపారు. ప్రభుత్వ సెలవు దినాలలో పరిశీలన ఉండదన్నారు. బాధితులు తమ తమ మండలాలకు కేటాయించిన తేదీల్లో ఒరిజినల్ అగ్రిగోల్డ్ బాండ్లతో పాటు సంబంధిత గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా తీసుకువచ్చి పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సీపీ సూచించారు.

బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి నియామకం రద్దు

- **ప్రస్తుత మఠాధిపతి వెంకటాద్రి స్వామి నియామకం, చట్ట ప్రకారం జరగలేదన్న హైకోర్టు**
- **శిష్యులు & మఠాధిపతులు ఎవరు లేరు. ఎక్కడెక్కడో గ్రామస్తుకవరు లెటర్లు ఇచ్చారని తేల్చి చెప్పిన హైకోర్టు**
- **శిష్యుల సమావేశం ఏర్పాటు చేసి మూడు నెలల్లో నూతన మఠాధిపతిని నామినేట్ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ**
- **పెద్ద కొడుకు మాత్రమే అర్హుడనేది తప్పని తేల్చేసిన హైకోర్టు.**
- **అప్పటివరకు తాత్కాలికంగా వెంకటాద్రి స్వామి ఆపద్ధర్మ మఠాధిపతిగా కొనసాగుతారు.**




బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) : కడప జిల్లా బ్రహ్మంగారి మఠం వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం 12వ మఠాధిపతిగా గత ఏడాది అక్టోబర్ 28వ తేదీ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించి ఆతర్వాత ధార్మిక పరిషత్ తాత్కాలిక మఠాధిపతిగా వెంకటాద్రి స్వామిని నియామకం చేసారు. ఆ నియామకంపై పూర్వ మఠాధిపతి కుమారుడు గోవింద స్వామి, ఈ నియామకం అక్రమమని ఉ చట్ట వ్యతిరేకమని హైకోర్టులో పిటీషన్ వేసారు.
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బుధవారం తీర్పు వెలువరిస్తూ, ప్రస్తుత తాత్కాలిక పీఠాధిపతిగా ఉన్న వెంకటాద్రి స్వామి నియామకం చట్టప్రకారం జరగలేదని, అది పూర్తి అక్రమమని స్పష్టం చేస్తూ, ఆ ఉత్తర్వులను రద్దు చేసింది.
ధార్మిక పరిషత్ మరలా కొత్త నియామక ప్రక్రియ చేపట్టాలని ఆదేశించింది.
ఇక్కడ శిష్యులు కొన్ని ముఖ్య విషయాలను చాలా లోతుగా గమనించాలి, చర్చించాలి!
గతంలో ఏం జరిగింది? : పోయినసారి పీఠాధిపతి ఎంపిక ఎలా జరిగిందో అందరికీ తెలిసిందే. దేశంలో వారు ఎవరైనా రావచ్చని, వారికి నచ్చిన వారికి ఓట్లు వేయాలని ఎవరికి ఎక్కువ మెజార్టీ వస్తే వారే పీఠాధిపతని వెంకటాద్రి స్వామి భారీగా ప్రచారం చేసారు. ఎక్కడెక్కడి వారో వచ్చారు.
హైకోర్టు శిష్యుల ద్వారా ఎంపిక చేయమంటే, ఇలా జరగడానికి కారకులు ఎవరు? వారి మీద చర్యలు ఏమిటి? శిష్యులకు ఎందుకు సమాచారం పంపలేదు? హైకోర్టు చెప్పినా కూడా శిష్యుల అవసరం లేదనుకొన్నది ఎవరు? లారీల్లో జనాలను తరలించి, బల ప్రదర్శన చేసిన ఒకరిని బలవంతంగా కూర్చోబెట్టడం చూసాం. జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో జరిగే రచ్చలా హిందూ మతంలో ఎప్పుడో ఒకసారి జరిగే ఒక గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని మార్చేశారు. పూజ్య శివస్వామి, విశ్వ హిందూ పరిషత్ నాయకులు విజయవాడ లో ప్రెస్ మీట్ పెట్టి జరిగిన ప్రక్రియ అరాచకమని ఖండన చేసారు.
హైకోర్టు తీర్పుతో శిష్యులందరికీ వస్తున్న పెద్ద సందేహం : ఇప్పుడు హైకోర్టు ఆ నియామకమే తప్పుడు మార్గంలో జరిగిందని, నియామకమే తప్పని స్పష్టంగా తేల్చింది. మరి అదే తప్పుడు దారిలో నియామకమైన వ్యక్తిని కొత్త పీఠాధిపతి ఎంపికయ్యేవరకు ఆయననే కొనసాగించాలని తీర్పు చెప్పడం ఏంటో భక్తులకు శిష్యులకు అర్థం కాలేదు!
ఆ వ్యక్తి అక్కడే పదవిలో కొనసాగుతూ ఉంటే... రేపు మళ్లీ జరగబోయే ఎంపికలో మిగతా శిష్యులను ఓటర్లను ఆయన ప్రభావితం చేయకుండా ఉండగలుగుతారా? ఇది ఎంతవరకు సమంజసం?
అసలైన అర్హతలు ఏమిటి? : ఇకనైనా ధార్మిక పరిషత్ శిష్యులని పిలిపించి ఓట్లు వేయించుకోవడం, మెజారిటీ ఉన్నవారికే పీఠం కట్టబెట్టడం లాంటి పద్ధతులు ఆపాలి. ముందు అసలు పోటీలో ఉన్నవారికి ఉండాల్సిన అర్హతలు ఏమిటి? ఆయా అర్హతలు పరీక్షించి నిర్ణయం తీసుకోవాలని శిష్యులు బలంగా కోరుతున్నారు
ఒక బైక్ నడపాలన్నా, కారు రోడ్డు మీదకు తేవాలన్నా లైసెన్స్ కంపల్సరీ! : మరి కోట్ల మంది ఆరాధించే ఒక ఆధ్యాత్మిక మఠానికి పీఠాధిపతయ్యే వ్యక్తికి ఉన్న కనీస జ్ఞానం ఏమిటో ముందుగా శిష్య సమాజానికి తెలియవద్దా? వారికి వేదాల మీద, హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీత, ఉపనిషత్తుల మీద, శాస్త్రాల మీద ఎంత పట్టుంది?
శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారు బోధించిన వేదాంత శాస్త్రం, అష్టాంగ యోగ, కాలజ్ఞాన తత్వాల మీద వారికి అవగాహన ఉందా? స్వార్థ బుద్ధి లేకుండా, నిస్వార్థంగా ధర్మం కోసం బతుకుతారా లేదా అని ముందుగా పరీక్ష పెట్టాలి కదా అని అనేక మంది శిష్యులు సోషల్ మీడియా వేదికగా మాట్లాడుతున్నారు.
"మేము మొదటి కొడుకులం, మేము రెండో కొడుకులం, మా వారసత్వం" అనే అర్థం పర్థం లేని వాదనలు తెచ్చి, జ్ఞానం లేనివాళ్లను ఆ పీఠం మీద కూర్చోబెడితే ఆ మఠాన్ని, ఆ ధర్మాన్ని ఎవరు రక్షించగలరు?
ఇప్పుడు రద్దు చేయబడిన వెంకటాద్రి స్వామి కావచ్చు, వీరభద్ర స్వామి కావచ్చు... ఎవరైనా సరే! హైకోర్టు లేదా ప్రభుత్వం గరికపాటి వారు లేదా చాగంటి కోటేశ్వర రావు గారి లాంటి ప్రముఖుల పర్యవేక్షణలో ఒక అర్హత పరీక్షకు సిద్ధం కావాలి. "మేము సిద్ధం, మాకు వేదాల మీద, తత్వాల మీద పట్టుంది" అని నిరూపించుకోవాలి. అలా కాకుండా "మాకు పరీక్షలు వద్దు, వారసత్వమే ముఖ్యం" అంటే ఎలా?
ముందు అర్హతలను నిర్ధారించండి... ఆ తర్వాతే పోటీలో నిలబెట్టండి! లేకపోతే భవిష్యత్తులోనూ మఠాన్ని ఆ బ్రహ్మంగారే రక్షించాలి అంటూ భక్తులు శిష్యులు కోరుతున్నారు.
పెద్దకొడుకే మఠాధిపతనే వాదనలో నిజం ఎంత? మొదటి మఠాధిపతిగా నియామకమయినది స్వామి వారి 2వ కొడుకు గోవింద స్వామి.
వారు, 1735 లో స్వర్గస్తులయ్యే నాటికి వారి ఇరువురు కుమారులు సాంబమూర్తి (22 ఏళ్లు), ఓంకారమయ్య (20) బ్రతికే ఉన్నారు.అయినా కూడా వారిద్దరిని కాదని గోవింద స్వామి చిన్న తమ్ముడు పోతులూరయ్య స్వామి 1735 లో మఠాధిపతయ్యారు. వీరు 1750లో స్వర్గస్తులవగా అప్పటికి కూడా పోతులూరి వంశంలో పై ఇద్దరు మగవారు, నలుగురు కూతుర్లు (ఈశ్వరీమాతతో కూడి) జీవించి ఉన్నారు. అయినను వారిద్దరినీ కాదని, పార్వతమ్మ 1751 వరకు మఠాధిపతిగా చేసినట్టు తాత్కాలిక మఠాధిపతి వెంకటాద్రి స్వామి, సూర్యచంద్రులు ఉన్నంత వరకు చరిత్రలో ఈ గ్రంథం నిలిచి ఉండునని వేదోక్త మహాదాశీర్వచనం అనే పేరుతో ముందుమాట రాసి ధృవీకరణ చేసి మఠంలో ఆవిష్కరణ చేసిన "స్వామి వారి వంశ వృక్షం కాలనిర్ణయ పట్టిక" గ్రంథంలో ఉన్న విషయాలే.
స్వామి వారి వంశం అంతరించి పోయిందనేది బూటకమా? : 1751లో వీరనారాయణమ్మ సంతతిలో, వారి మనుమడు పెద గోవింద స్వాములు మఠాధిపతయే నాటికి కూడా గోవింద స్వామి రెండో కొడుకు ఓంకారమయ్య (1755 వరకు) జీవించి ఉన్నట్టు ఉన్నది. అలానే ఈశ్వరీ మాత ఉవారి చెల్లెల్లు జీవించి ఉన్నారు. పోతులూరి వంశం అంతరించకముందే వీరనారాయణమ్మ సంతతి వారు మఠాధిపతి అయ్యారు.
మఠాధిపతిగా భార్య ఉండడం తప్పనిసరినా? : పెద గోవింద స్వాములు మఠాధిపతయ్యేనాటికి భార్య లేదనేది "మాజీ మేనేజర్ పెంచలయ్య" ముందు మాట రాసి ఆవిష్కరణ చేసిన వీరనారాయణమ్మ చరిత్ర గ్రంథంలో నిక్షిప్తం చేసిన అంశం. వారు 40 ఏళ్లు పెళ్లి చేసుకోకుండానే మఠాధిపతిగా కొనసాగారు.
ఆ తరువాత వీరి కొడుకు సదానంద గోవిందస్వామి 6 ఏళ్ల పాటు భార్య చనిపోయిన తరువాత పెళ్లి చేసుకోకుండానే తుదిశ్వాస వరకు కొనసాగారు.
అలానే వెంకటాద్రయ్య స్వామి భార్య చనిపోయిన తరువాత 5 ఏళ్ల పాటు మరలా పెళ్లి చేసుకోకుండానే తుదిశ్వాస వరకు కొనసాగారు.
అలానే పెద్ద వీరయ్య స్వామి, చిన్న వీరయ్య స్వామి కూడా భార్య చనిపోయిన తరువాత పెళ్లి చేసుకోకుండానే తుదిశ్వాస వరకు కొనసాగారు.
మరి ఈశ్వరి దేవి మఠం పీఠాధిపతి శివ కుమార స్వామి ఉ సిద్దయ్య మఠం వారు
ఏ చరిత్ర చూసి ప్రథమ కొడుకు మాత్రమే మఠాధిపతని ధార్మిక పరిషత్ వారికి లేఖ ఇచ్చారానేది అర్థం కాక భక్తజనులు శిష్యులు మండిపడుతున్నారు.

జర్నలిస్ట్ ఫైల్
JOURNALIST FILE
సంపాదక స్వరం
EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

- పోలీసుల లెక్కలు కాదు.. రాజ్యాంగమే ప్రామాణికం!
- అరెస్టు ఎప్పటి నుంచి ? నిర్బంధించిన క్షణం నుంచే 24 గంటల గడువు
- సుప్రీంకోర్టు తీర్పు పౌరుల స్వేచ్ఛకు బలమైన రక్షణ

స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తే..
రాజ్యాంగం చూస్తూ ఊరుకోదు



వ్యక్తిగత స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ఒక వ్యక్తిని నేరం చేసినట్లు అనుమానించి పోలీసులు అదుపులోకి తీసుకున్నంత మాత్రాన అతని ప్రాథమిక హక్కులు రద్దయిపోవు. చట్టాన్ని అమలు చేసే అధికారులకు ఎంత అధికారం ఉంటుందో, ఆ అధికారాల దుర్వినియోగాన్ని అడ్డుకునే రాజ్యాంగ పరిమితులు కూడా అంతే కీలకం. ముఖ్యంగా అరెస్టు, పోలీసు నిర్బంధం వంటి అంశాల్లో రాజ్యాంగం కల్పించిన రక్షణలు కేవలం న్యాయపుస్తకాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు కావాలి. ఈ దిశగా సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన కీలక తీర్పు దేశంలోని పోలీసు, దర్యాప్తు వ్యవస్థలకు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది.

ఒక వ్యక్తిని పోలీసులు వాస్తవంగా అదుపులోకి తీసుకున్న సమయం నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని, అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టయిన వ్యక్తిని సమీప మేజిస్ట్రేట్ ఎదుట 24 గంటల్లోగా హాజరుపరచాలి. అయితే ఈ గడువును లెక్కించేటప్పుడు వ్యక్తి స్వేచ్ఛను వాస్తవంగా హరించిన సమయాన్నే పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. అరెస్టు నమోదు చేయడానికి ముందు విచారణ, దర్యాప్తు పేరుతో గడిపిన సమయాన్ని 24 గంటల లెక్క నుంచి మినహాయించడానికి వీల్లేదని పేర్కొంది.

న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చంద్రకూర్‌లతో కూడిన ధర్మాసనం సుజిత్ దాస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఈ తీర్పు వెలువరించింది. త్రిపురలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులో నలుగురు నిందితులు దాఖలు చేసిన అప్పీళ్లను విచారిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. సెప్టెంబరు 29, 2025న మధ్యాహ్నం సుమారు 2 గంటలకు వారిని దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకోగా, మరుసటి రోజు ఉదయం 11 గంటలకు అధికారికంగా అరెస్టు చేసినట్లు నమోదు చేశారు. అనంతరం సెప్టెంబరు 30న సాయంత్రం 4.45 గంటలకు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వాస్తవ నిర్బంధ సమయం నుంచి లెక్కిస్తే రాజ్యాంగం నిర్దేశించిన గడువు ఉల్లంఘనకు గురైనట్లు సుప్రీంకోర్టు గుర్తించింది. దీంతో త్రిపుర హైకోర్టు గతంలో ఇచ్చిన బెయిల్ నిరాకరణ ఉత్తర్వును పక్కనపెట్టి, నలుగురిని తక్షణమే విడుదల చేయాలని ఆదేశించింది.

అరెస్టు నమోదు చేయకపోతే హక్కులు నిలిచిపోవు : ఈ తీర్పులో అత్యంత కీలకమైన అంశం అరెస్టు, నిర్బంధం మధ్య కృత్రిమ వ్యత్యాసాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించడం. ఒక వ్యక్తిని పోలీసు బృందం అదుపులోకి తీసుకుని, అతని కదలికల స్వేచ్ఛను నియంత్రిస్తూ విచారణ కొనసాగిస్తే అది నిర్బంధమే అవుతుంది. అలాంటి పరిస్థితిలో అధికారిక అరెస్టు నమోదు చేయలేదనే కారణంతో రాజ్యాంగ రక్షణలను నిలిపివేయలేరు. అరెస్టు పత్రాల్లో సమయాన్ని ఆలస్యంగా నమోదు చేయడం ద్వారా చట్టం నిర్దేశించిన గడువును పొడిగించుకునే అవకాశం దర్యాప్తు సంస్థలకు లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది.

విచారణ పేరుతో ఒక వ్యక్తిని గంటల తరబడి అదుపులో ఉంచి, ఆ తర్వాత అరెస్టు చేసినట్లు చూపించడం వల్ల వ్యక్తిగత స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలుగుతుంది. ఇలాంటి పద్ధతులు పోలీసు అధికార దుర్వినియోగానికి, కస్టడీ హింసకు అవకాశాలు కల్పిస్తాయి. అందుకే నిర్బంధం ప్రారంభమైన సమయమే కీలకమని సుప్రీంకోర్టు పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది.

మేజిస్ట్రేట్ బాధ్యత మరింత కీలకం : ఈ తీర్పు పోలీసు వ్యవస్థకే కాకుండా న్యాయవ్యవస్థలోని మేజిస్ట్రేట్‌ల బాధ్యతను కూడా గుర్తుచేస్తోంది. నిందితుడిని తమ ఎదుట హాజరుపరిచినప్పుడు కేవలం పోలీసుల రిమాండ్ నివేదికను పరిశీలించి యాంత్రికంగా ఆమోదించడం సరిపోదు. వ్యక్తిని వాస్తవంగా ఎప్పుడు అదుపులోకి తీసుకున్నారు? ఎప్పుడు అరెస్టు నమోదు చేశారు? మేజిస్ట్రేట్ ఎదుట ఎప్పుడు హాజరుపరిచారు? ఈ వివరాలను స్వతంత్రంగా పరిశీలించాలి. నిర్బంధం ప్రారంభమైన తేదీ, సమయాన్ని నమోదు చేయడంతో పాటు 24 గంటల రాజ్యాంగ గడువు పాటించారా లేదా అన్నది నిర్ధారించాలి.

అంతేకాకుండా 24 గంటల్లోగా హాజరుపరిచినంత మాత్రాన పోలీసుల నిర్బంధం సమర్థనీయమైపోదు. ఆ వ్యవధిలోనూ వ్యక్తిని అనవసరంగా అదుపులో ఉంచారా? దర్యాప్తు పేరుతో అతని స్వేచ్ఛను దుర్వినియోగం చేశారా? అనే అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. న్యాయపరమైన పర్యవేక్షణ అనేది కేవలం రిమాండ్ మంజూరు చేసే ప్రక్రియ కాదు. రాజ్యాంగ హక్కులకు రక్షణ కల్పించే బాధ్యత కూడా.

దర్యాప్తు స్వేచ్ఛకు పరిమితులు అవసరం : దేశంలో ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాలు వంటి తీవ్రమైన నేరాలను అరికట్టడానికి దర్యాప్తు సంస్థలకు తగిన అధికారాలు అవసరం. అయితే ఆ అధికారాలు రాజ్యాంగ పరిధిలోనే ఉండాలి. కఠినమైన చట్టాల కింద నమోదైన కేసుల్లోనూ నిందితులకు రాజ్యాంగం కల్పించిన కనీస రక్షణలు వర్తిస్తాయి. నేర తీవ్రత ఎంత ఎక్కువగా ఉన్నా చట్టబద్ధమైన ప్రక్రియను పక్కనపెట్టడానికి వీల్లేదు.

దర్యాప్తు సంస్థల పనితీరును కేవలం నేరాల ఛేదన, అరెస్టులు, చార్జిషీట్ల సంఖ్య ఆధారంగా అంచనా వేయకూడదు. చట్టబద్ధంగా ఆధారాలు సేకరించాయా? నిందితుల హక్కులను గౌరవించాయా? కస్టడీలో మానవ హక్కులను కాపాడాయా? అనే అంశాలు కూడా అంతే ముఖ్యమైనవి. న్యాయం సాధించాలనే లక్ష్యంతో సాగాల్సిన దర్యాప్తు ప్రక్రియే అన్యాయానికి కారణం కాకూడదు.

చట్టబద్ధమైన అరెస్టు.. బాధ్యతాయుతమైన దర్యాప్తు : సుప్రీంకోర్టు తాజా తీర్పు పోలీసు అధికారాలను తగ్గించడం కాదు. వాటిని రాజ్యాంగబద్ధమైన మార్గంలో వినియోగించాలనే స్పష్టమైన ఆదేశం. అరెస్టు చేసిన సమయాన్ని పారదర్శకంగా నమోదు చేయడం, కస్టడీ వివరాలను భద్రపరచడం, మేజిస్ట్రేట్ ఎదుట సరైన సమాచారాన్ని సమర్పించడం వంటి విధానాలను మరింత కట్టుదిట్టం చేయాలి. పోలీసు శిక్షణలోనూ వ్యక్తిగత స్వేచ్ఛ, అరెస్టు నిబంధనలు, కస్టడీ హక్కులపై ప్రత్యేక అవగాహన కల్పించాలి.

ప్రజాస్వామ్యంలో పోలీసు వ్యవస్థ బలంగా ఉండాలి. అదే సమయంలో పౌరుల హక్కులు కూడా అంతే బలంగా రక్షించబడాలి. చట్టాన్ని ఉల్లంఘించినవారిని శిక్షించడం ఎంత ముఖ్యమో, చట్టాన్ని అమలు చేసే వారే చట్టపరిమితులను ఉల్లంఘించకుండా చూడటం కూడా అంతే ముఖ్యం.

అరెస్టు చేసిన సమయాన్ని మార్చి చూపించవచ్చు.. కానీ నిర్బంధించిన వాస్తవాన్ని మార్చలేరు. అధికారిక రికార్డుల్లో సమయం ఆలస్యంగా నమోదు చేయవచ్చు.. కానీ రాజ్యాంగం కల్పించిన హక్కులను ఆలస్యం చేయలేరు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిన క్షణం నుంచే చట్టం అప్రమత్తమవుతుందని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేస్తోంది.న్యాయం అనేది కేవలం నేరస్థుడికి శిక్ష విధించడంలోనే లేదు. నిర్దోషికి అన్యాయం జరగకుండా చూడటంలోనూ ఉంది. పోలీసు అధికారానికి రాజ్యాంగం హద్దులు విధించడం బలహీనతకు సంకేతం కాదు.. ప్రజాస్వామ్య బలానికి నిదర్శనం. పౌరుల స్వేచ్ఛను కాపాడుతూ చట్టాన్ని అమలు చేయగలిగినప్పుడే న్యాయపాలనకు నిజమైన అర్థం చేకూరుతుంది.

- నెతన్యాహుకు రాజకీయ గండం..
- ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారిన అరబ్ పార్టీల బలం
- ఐసెన్‌కోట్‌కు 67 మంది ఎంపీల మద్దతు... మారుతున్న రాజకీయ సమీకరణాలు



అరబ్ పార్టీల నిర్ణయం..
ఇజ్రాయెల్ రాజకీయాల్లో ప్రకంపనలు

ఇజ్రాయెల్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సుదీర్ఘకాలంగా దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మరోసారి అధికారాన్ని చేపట్టాలన్న ప్రయత్నాలకు గట్టి సవాలు ఎదురవుతోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ ఏ కూటమికీ రాకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ నెలకొంది. ఈ సమయంలో అరబ్ పార్టీల మద్దతు ప్రతిపక్ష నేత, మాజీ సైనిక దళాల ప్రధానాధికారి గడి ఐసెన్‌కోట్‌కు కీలక బలంగా మారింది. నెతన్యాహును అధికారానికి దూరంగా ఉంచాలన్న లక్ష్యంతో అరబ్ పార్టీలు తీసుకున్న నిర్ణయం ఇజ్రాయెల్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. అక్టోబర్ 27న జరిగిన ఎన్నికల్లో 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ (నెస్సెట్)లో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 61 స్థానాల మెజారిటీ ఏ కూటమికీ లభించలేదు. నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీ ఆధ్వర్యపు కూటమి 53 స్థానాలకే పరిమితమైంది. ఐసెన్‌కోట్ నాయకత్వంలోని యూదు ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు వచ్చాయి. మరోవైపు అరబ్ రాజకీయ పార్టీలకు చెందిన రెండు ప్రధాన కూటములు కలిపి 19 స్థానాలు సాధించాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటులో వాటి మద్దతు అత్యంత కీలకంగా మారింది.

కింగ్‌మేకర్లుగా మారిన అరబ్ పార్టీలు : ఇజ్రాయెల్‌లో అరబ్ రాజకీయ పార్టీలకు ఈ స్థాయిలో నిర్ణయాత్మక పాత్ర లభించడం ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో ప్రత్యేకత. 11 స్థానాలు గెలుచుకున్న జాయింట్ లిస్ట్ కూటమి, ఎనిమిది స్థానాలు సాధించిన రామ్ (యునైటెడ్ అరబ్ లిస్ట్) పార్టీలు ఐసెన్‌కోట్‌కు మద్దతు ప్రకటించాయి. అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు ఐసెన్‌కోట్ పేరును ప్రభుత్వ ఏర్పాటుకు సిఫారసు చేయనున్నట్లు జాయింట్ లిస్ట్ వెల్లడించింది. రెండు పార్టీల మద్దతుతో ఐసెన్‌కోట్‌కు అనుకూలంగా 67 మంది ఎంపీల సిఫారసులు లభించాయి. ఇది 120 మంది సభ్యుల పార్లమెంటులో సాధారణ మెజారిటీకి అవసరమైన 61 స్థానాల కంటే ఎక్కువ.

ఈ నిర్ణయం వెనుక రాజకీయ వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. నెతన్యాహు నేతృత్వంలోని ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడం, కొత్త రాజకీయ ప్రత్యామ్నాయానికి అవకాశం కల్పించడం అరబ్ పార్టీల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇంతకాలం ఇజ్రాయెల్ రాజకీయాల్లో అరబ్ పార్టీల మద్దతును అనేక యూదు పార్టీలు రాజకీయంగా సున్నితమైన అంశంగా పరిగణించాయి. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఏర్పాటుకు తమ మద్దతును ప్రకటించడం రాజకీయంగా గణనీయమైన మార్పు.

అయితే ఈ మద్దతును నేరుగా సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడంగా భావించకూడదు. జాయింట్ లిస్ట్ ప్రభుత్వంలో చేరకుండా బయట నుంచి మద్దతు ఇవ్వడానికి సుముఖత చూపుతోంది. మరోవైపు ఐసెన్‌కోట్ శిబిరంలోనూ అరబ్ పార్టీలతో అధికార భాగస్వామ్యంపై ఏకాభిప్రాయం లేదు. అందువల్ల 67 మంది ఎంపీల సిఫారసులు ఉన్నప్పటికీ, స్థిరమైన ప్రభుత్వ ఏర్పాటుకు మరిన్ని రాజకీయ చర్చలు అవసరం.

నెతన్యాహు రాజకీయ ప్రస్థానానికి పరీక్ష : నెతన్యాహు ఇజ్రాయెల్ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నాయకుల్లో ఒకరు. భద్రత, జాతీయవాదం, పాలస్తీనా అంశాలపై కఠిన వైఖరితో తన రాజకీయ పునాదిని బలోపేతం చేసుకున్నారు. అయితే గత కొన్నేళ్లుగా దేశం ఎదుర్కొంటున్న భద్రతా సంక్షోభాలు, యుద్ధ పరిస్థితులు, అంతర్గత రాజకీయ విభేదాలు ఆయన ప్రభుత్వానికి సవాళ్లుగా మారాయి. 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి అనంతరం ఇజ్రాయెల్ చేపట్టిన సైనిక చర్యలు దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపాయి. గాజా యుద్ధం, బందీల సమస్య, సైనిక భద్రత, పాలస్తీనా ప్రజల పరిస్థితి వంటి అంశాలపై ప్రభుత్వ విధానాలు దేశంలోనూ, అంతర్జాతీయంగానూ విస్తృత చర్చకు దారితీశాయి. ఈ పరిణామాల మధ్య జరిగిన ఎన్నికల్లో నెతన్యాహు కూటమి మెజారిటీకి దూరమవడం ఆయన నాయకత్వానికి ఎదురైన రాజకీయ పరీక్షగా చూడవచ్చు. అంతేకాక, నెతన్యాహు సంప్రదాయ మిత్రపక్షంగా ఉన్న అల్ట్రా ఆర్థడాక్స్ యునైటెడ్ తోరా జుడాయిజం పార్టీ ఈసారి ఏ అభ్యర్థికీ మద్దతు సిఫారసు చేయకపోవడం ఆయన రాజకీయ పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. సైనిక సేవ నుంచి మినహాయింపుల అంశంపై నెలకొన్న విభేదాలు ఈ నిర్ణయానికి కారణాల్లో ఒకటిగా నిలిచాయి.

ఇజ్రాయెల్ పార్లమెంటరీ వ్యవస్థలో ప్రభుత్వ ఏర్పాటుకు సంఖ్యాబలం అత్యంత కీలకం. ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించిన పార్టీ నాయకుడికే ప్రధానమంత్రి పదవి దక్కుతుందనే నిబంధన లేదు. పార్లమెంటులో మెజారిటీ మద్దతు కూడగట్టగల నేతకు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో అరబ్ పార్టీల మద్దతు ఐసెన్‌కోట్ రాజకీయ అవకాశాలను గణనీయంగా పెంచింది. అయితే అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ఎవరిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారన్నది తదుపరి కీలక పరిణామం. ఆహ్వానం అందుకున్న అభ్యర్థి 28 రోజుల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. అవసరమైతే మరో 14 రోజుల గడువు పొడిగించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియలో పార్టీల మధ్య విధానపరమైన విభేదాలు, మంత్రిత్వ శాఖల కేటాయింపులు, ప్రభుత్వ కార్యక్రమంపై ఏకాభిప్రాయం సాధించడం కీలకంగా మారనున్నాయి.


అరబ్ పార్టీల మద్దతు ఇజ్రాయెల్ రాజకీయాల్లో కేవలం అధికార మార్పిడి అంశం మాత్రమే కాదు. దేశంలోని అరబ్ పౌరుల రాజకీయ ప్రాతినిధ్యం, సమాన హక్కులు, భద్రత, సామాజిక సమస్యలు కూడా ఈ పరిణామంతో చర్చకు వస్తున్నాయి. ఇజ్రాయెల్ జనాభాలో గణనీయమైన వాటా కలిగిన అరబ్ పౌరుల ఓట్లు, వారి రాజకీయ ఆకాంక్షలు ప్రభుత్వ ఏర్పాటులో నిర్ణయాత్మక శక్తిగా మారడం ప్రజాస్వామ్య రాజకీయాల పరిణామాన్ని సూచిస్తోంది.

అయితే ఈ మద్దతుతోనే పాలస్తీనా సమస్యకు పరిష్కారం లభిస్తుందని, గాజా యుద్ధం ముగుస్తుందని భావించడం తొందరపాటు అవుతుంది. ఐసెన్‌కోట్ రాజకీయ విధానాలు, ఆయనకు మద్దతు ఇస్తున్న పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు, ఇజ్రాయెల్ భద్రతా విధానం వంటి అంశాలు కొత్త ప్రభుత్వ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అరబ్ పార్టీల మద్దతు వెనుక ఉన్న ప్రజల ఆకాంక్షలకు కొత్త ప్రభుత్వం ఎంతవరకు ప్రాధాన్యత ఇస్తుందన్నది కూడా పరిశీలించాల్సిన అంశం. ప్రస్తుత పరిణామాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ శక్తినీ తక్కువ అంచనా వేయలేం. ఎన్నికల్లో వచ్చిన సంఖ్యాబలం, ప్రజల తీర్పు, పార్టీల మధ్య రాజకీయ అవగాహనలే అధికార సమీకరణాలను నిర్ణయిస్తాయి. నెతన్యాహు రాజకీయ ఆధిపత్యానికి సవాలు విసురుతూ అరబ్ పార్టీలు కీలక పాత్రలోకి రావడం ఇజ్రాయెల్ రాజకీయ చరిత్రలో ప్రాధాన్యం కలిగిన పరిణామం.

నెతన్యాహు మళ్లీ అధికారాన్ని చేపడతారా? ఐసెన్‌కోట్ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా? అరబ్ పార్టీల మద్దతు స్థిరమైన రాజకీయ భాగస్వామ్యంగా మారుతుందా? ఈ ప్రశ్నలకు రానున్న రోజుల్లో సమాధానాలు లభించనున్నాయి. ఇజ్రాయెల్ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామం ఒక నాయకుడి రాజకీయ భవిష్యత్తుకే పరిమితం కాదు.. దేశ ప్రజాస్వామ్య దిశను, రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేయగల కీలక మలుపు.

యంత్రాల చేతుల్లో ప్రజల హక్కులా?

సాంకేతికతకు హద్దులుండాలి..
అధికారులకు బాధ్యత ఉండాలి
పాలనకు ఏఐ సహాయకారి మాత్రమే..
నిర్ణయాధికారి కాదు!



కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తోంది. విద్య, వైద్యం, పరిశోధన, పారిశ్రామిక రంగాలతో పాటు ప్రభుత్వ పరిపాలనలోనూ ఏఐ వినియోగం విస్తరిస్తోంది. సమాచార విశ్లేషణ, రికార్డుల పరిశీలన, ఫైళ్ల నిర్వహణ, సేవల వేగవంతమైన అందజేత వంటి అంశాల్లో ఏఐ సాంకేతికత ప్రభుత్వాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని మానవ విచక్షణను పక్కనపెట్టి, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక నిర్ణయాలను యంత్రాలపై వదిలేయడం ఎంతవరకు సమంజసం? తెలంగాణలో తాజాగా వెలుగులోకి వచ్చిన ఒక భూ వివాదం ఈ ప్రశ్నను మరోసారి సమాజం ముందుకు తెచ్చింది.

తెలంగాణలోని జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పెద్దమడూరు గ్రామానికి చెందిన మెడిపల్లి కొమురయ్య భూ వివాదానికి సంబంధించి జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించారు. తన వాదనలు వినకుండా, క్షేత్రస్థాయిలో భూమికి సంబంధించిన వాస్తవాలను పరిశీలించకుండా అధికారులు నిర్ణయం తీసుకున్నారని పిటిషనర్ ఆరోపించారు. అంతేకాకుండా, వివాదాస్పద ఉత్తర్వుల రూపకల్పనలో కలెక్టర్ కార్యాలయం కృత్రిమ మేధ సాధనాలను ఉపయోగించిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన తెలంగాణ హైకోర్టు, సంబంధిత ఉత్తర్వుల అమలుపై మధ్యంతర స్టే విధించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. అధికారుల స్వతంత్ర విచక్షణకు ఏఐ ప్రత్యామ్నాయం కాదన్న అంశాన్ని న్యాయస్థానం స్పష్టం చేయడం ఈ సందర్భంలో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

సాంకేతికత పేరుతో సహజ న్యాయసూత్రాలకు తిలోదకాలు వద్దు : భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన న్యాయపరమైన రక్షణల్లో సహజ న్యాయసూత్రాలకు (ప్రతీఅఅఎఅజూశ్రీవం శీట చీఛబఱ్తుశ్రీ జీబర్‌అఎవ) అత్యంత ప్రాధాన్యం ఉంది. ఒక వ్యక్తి హక్కులకు భంగం కలిగించే నిర్ణయం తీసుకునే ముందు అతని వాదన వినడం, సంబంధిత ఆధారాలను పరిశీలించడం, నిర్ణయానికి తగిన కారణాలను తెలియజేయడం పరిపాలనా వ్యవస్థలో కనీస బాధ్యత. ముఖ్యంగా భూముల వివాదాల్లో ఈ సూత్రాలను మరింత జాగ్రత్తగా పాటించాలి. ఎందుకంటే భూమి అనేది కేవలం ఆస్తి మాత్రమే కాదు. అనేక కుటుంబాలకు అది జీవనాధారం, ఆర్థిక భద్రత, తరతరాల వారసత్వం. ఒక రెవెన్యూ అధికారి తీసుకునే తప్పుడు నిర్ణయం ఒక కుటుంబం భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేయగలదు.

భూ వివాదాల పరిష్కారంలో పాత రికార్డులు, సర్వే నంబర్లు, పట్టాదారు పాస్‌బుక్కులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వారసత్వ వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు వంటి అనేక అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో దశాబ్దాల నాటి రికార్డుల మధ్య వైరుధ్యాలు ఉంటాయి. ఒకే భూమిపై పలువురు హక్కులు కోరుతూ వివాదాలు తలెత్తుతాయి. ఇలాంటి సందర్భాల్లో కంప్యూటర్‌లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా మాత్రమే వాస్తవాలను నిర్ధారించడం సాధ్యం కాదు. క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత వ్యక్తుల వాదనలు, అధికారిక రికార్డుల ధ్రువీకరణ తప్పనిసరి. ఏఐ అందించే సమాచారం తప్పుగా ఉండవచ్చు, అసంపూర్ణంగా ఉండవచ్చు. అందువల్ల దానిని అంతిమ సత్యంగా పరిగణించడం పరిపాలనా నిర్లక్ష్యమే అవుతుంది.

బాధ్యత యంత్రానిది కాదు.. అధికారి దే! ఇక్కడ మరో కీలకమైన అంశాన్ని గుర్తించాలి. ఏఐ సాయంతో ఒక ఉత్తర్వు ముసాయిదాను తయారు చేయడం ఒకటైతే, ఆ ఉత్తర్వును పరిశీలించకుండా యథాతథంగా ఆమోదించి సంతకం చేయడం మరొకటి. ఈ రెండింటి మధ్య స్పష్టమైన తేడా ఉంది. సాంకేతికతను ఉపయోగించడం తప్పు కాదు. కానీ దాని ద్వారా రూపొందిన సమాచారాన్ని ధ్రువీకరించకుండా అధికారిక నిర్ణయంగా మార్చడం మాత్రం తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది.

ప్రభుత్వ అధికారి తనకు అప్పగించిన అధికారాలను స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వినియోగించాలి. ఏఐ రూపొందించిన ముసాయిదా అయినా, సిబ్బంది తయారుచేసిన నివేదిక అయినా, దానిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారిదే. ఒకవేళ ఉత్తర్వులో తప్పులు దొర్లితే ఏఐని బాధ్యురాలిగా చేయలేం. చట్టపరంగా, పరిపాలనాపరంగా బాధ్యత వహించాల్సింది ఆ ఉత్తర్వును జారీ చేసిన అధికారే. సాంకేతికతను సాకుగా చూపి బాధ్యత నుంచి తప్పించుకునే అవకాశం ఎవరికీ ఉండకూడదు.

వేగం కంటే నాణ్యత ముఖ్యం : ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి నిర్దిష్ట గడువులు విధించడం మంచి పరిణామమే. ఫైళ్లు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండకూడదు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి తొలగాలి. అయితే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం వేరు, కేవలం గడువులోగా వాటిని ముగించినట్లు చూపించడం వేరు. ఫిర్యాదుల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా మారితే అసలు సమస్య పరిష్కారం కాకుండానే కాగితాలపై పరిష్కారమైనట్లు చూపించే ప్రమాదం ఉంది.

ప్రజా సమస్యల పరిష్కారంలో గణాంకాల కంటే వాస్తవ ఫలితాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించారన్నదానికంటే ఎంతమంది బాధితులకు న్యాయం జరిగిందన్నది ముఖ్యమైన కొలమానం కావాలి. ఏఐ వినియోగం వల్ల ఫైళ్ల పరిష్కార వేగం పెరిగినా, ప్రజలకు న్యాయం అందకపోతే ఆ సాంకేతిక పురోగతికి అర్థం ఉండదు.

ఏఐ వినియోగానికి స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం : ప్రభుత్వ పరిపాలనలో ఏఐ వినియోగాన్ని పూర్తిగా వ్యతిరేకించడం వివేకవంతమైన విధానం కాదు. అదే సమయంలో నియంత్రణలు లేకుండా దాని వినియోగాన్ని ప్రోత్సహించడం కూడా ప్రమాదకరం. అందువల్ల ప్రభుత్వాలు సమగ్ర మార్గదర్శకాలను రూపొందించాలి.

1. ప్రజల హక్కులు, ఆస్తులు, జీవనాధారాలను ప్రభావితం చేసే నిర్ణయాల్లో ఏఐని కేవలం సహాయక సాధనంగానే ఉపయోగించాలి.
2. ఏఐ ద్వారా రూపొందించిన నివేదికలు, ఉత్తర్వుల ముసాయిదాలను సంబంధిత అధికారులు తప్పనిసరిగా పరిశీలించి, వాస్తవాలను ధ్రువీకరించాలి.
3. బాధితులందరికీ తమ వాదనలు వినిపించుకునే సముచిత అవకాశం కల్పించాలి.
4. భూ రికార్డులు, రెవెన్యూ పత్రాలు, వ్యక్తిగత వివరాల విషయంలో సమాచార భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి.
5. ఏఐ వినియోగించిన సందర్భాల్లో దాని వివరాలు, సమాచార ఆధారాలు, అధికారి చేసిన పరిశీలనకు సంబంధించిన రికార్డులను భద్రపరచాలి.
6. తప్పుడు లేదా ఏకపక్ష ఉత్తర్వులు జారీ చేసినప్పుడు బాధ్యత వహించే అధికారులపై తగిన చర్యలు తీసుకునే వ్యవస్థ ఉండాలి.

ఇలాంటి మార్గదర్శకాలు కేవలం రెవెన్యూ శాఖకే పరిమితం కాకూడదు. మున్సిపల్ పరిపాలన, సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, పోలీసు వ్యవస్థ, పౌర సేవలు వంటి ప్రజల హక్కులతో ముడిపడిన అన్ని విభాగాలకూ వర్తించాలి.

డిజిటల్ పాలనలో మానవీయతకు చోటుండాలి : ఏఐ వినియోగంపై చర్చ జరుగుతున్న సమయంలో మరో అంశాన్ని విస్మరించకూడదు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా మానవ అనుభవం, సామాజిక పరిస్థితుల అవగాహన, నైతిక బాధ్యత, ప్రజల పట్ల స్పందనలను పూర్తిగా భర్తీ చేయలేదు. ఒక రైతు భూమి సమస్యతో కలెక్టర్ కార్యాలయానికి వచ్చినప్పుడు అతను కేవలం ఒక ఫైలు నంబరు కాదు. అతని వెనుక ఒక కుటుంబం, ఆర్థిక పరిస్థితి, జీవన పోరాటం ఉంటాయి. కంప్యూటర్ తెరపై కనిపించే సమాచారం ఆ మనిషి వాస్తవ జీవితాన్ని పూర్తిగా ప్రతిబింబించకపోవచ్చు. తెలంగాణ హైకోర్టు ముందుకు వచ్చిన జనగామ భూ వివాదం ఈ అంశాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. ఈ కేసులో ఆరోపణలు, అధికారుల వివరణలు, న్యాయస్థానం తుది నిర్ణయం వంటి అంశాలు ఇంకా పూర్తిగా తేలాల్సి ఉంది. తదుపరి విచారణ నవంబరు 18న జరగనుంది. అయితే ఈ వ్యవహారం లేవనెత్తిన పరిపాలనా ప్రశ్నలను ప్రభుత్వం ఇప్పుడే తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏఐ ప్రవేశించాలి.. కానీ అధికారుల బాధ్యతను బయటకు పంపకూడదు. ఫైళ్ల వేగం పెరగాలి.. కానీ న్యాయం తగ్గకూడదు. డిజిటల్ పాలన అభివృద్ధి చెందాలి.. కానీ ప్రజల గొంతు వినిపించే అవకాశం కనుమరుగు కాకూడదు.

ప్రజాస్వామ్య పరిపాలనలో సాంకేతికతకు స్థానం ఉంది. అయితే అంతిమంగా నిర్ణయాధికారం, జవాబుదారీతనం, ప్రజల పట్ల మానవీయ స్పందన అధికారుల చేతుల్లోనే ఉండాలి. యంత్రాలు సమాచారాన్ని విశ్లేషించగలవు.. కానీ న్యాయాన్ని అందించే బాధ్యత మనుషులదే. అదే బాధ్యతాయుతమైన డిజిటల్ పాలనకు అసలైన పునాది కావాలి.

వర్షానికి విరిగిపడిన, ఒరిగిన చెట్ల తొలగింపు.

- పంచాయతీ కార్యదర్శి అమల ఆధ్వర్యంలో చెట్ల తొలగింపు పనులు.





ఏన్కూరు, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :

ఏన్కూరు మండలం ఆరికాయలపాడు గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో పలుచోట్ల చెట్లు విరిగిపడటంతో పాటు రహదారులపైకి ఒరిగాయి. దీంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ ఆదేశాల మేరకు గ్రామంలో ఎక్కడెక్కడ చెట్లు విరిగిపడ్డాయి, ఎక్కడ రహదారులపైకి ఒరిగాయో గుర్తించి వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అమల సిబ్బందితో కలిసి రహదారులకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తూ రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వర్షాల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్న పంచాయతీ అధికారుల చర్యలను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

యాదవ సమాజాన్ని ఉద్ధరించేందుకే విద్యావంతుల ఐక్య వేదిక.

- నూతన జిల్లా అధ్యక్షురాలిగా మంజుల యాదవ్.
- నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్.
- హాస్టల్ భవనం కోసం లక్ష విరాళం అందజేస్తా.



నిజామాబాద్, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :

యాదవ సమాజాన్ని ఉద్ధరించేందుకే విద్యావంతుల ఐక్య వేదిక ను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ యాదవ్ అన్నారు.గురువారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ముందుగా విద్యావంతుల జిల్లా అధ్యక్షురాలిగా దండేమేని మంజుల యాదవ్ కు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ..యాదవ సమాజాన్ని చైతన్య పరిచేందుకు గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తామన్నారు.ఆనాడు తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందంటే అందుకు కారణం విద్యావంతుల వేదిక ఏర్పాటు చేయడమేనని,విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మి ఈ కార్యక్రమాన్ని పూనుకున్నట్లు తెలిపారు.యాదవ సమాజం అభివృద్ధి చెందాలన్న,రాజకీయంగా రాణించాలన్న ముందుగా సమాజంపై అవగాహన ఉండాలన్నారు.అన్ని జిల్లాలలో విద్యావంతుల వేదిక ఏర్పాటు చేసి,ఒకే తాటిపైకి వచ్చేలా ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షురాలు మంజుల యాదవ్ మాట్లాడుతూ..యాదవ సమాజం అభివృద్ధిలో నా పాత్రను గ్రహించి,జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు.యాదవ సమాజం అభివృద్ధికి తన వంతు కృషి తప్పక ఉంటుందన్నారు.తనపై నమ్మకంతో అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.మేమెంతో మాకంత వాట దక్కాలన్న ముందుగా యాదవులలో చైతన్యం రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.జిల్లాలో పూర్తిస్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి,గ్రామ గ్రామాన ఉన్న యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.యాదవులను భయాందోళనలకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.నిజామాబాద్ జిల్లాలో వీడీసీలతో యాదవ కులస్తులు కొంత మేరకు ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లారు.త్వరలోనే యాదవ కులస్తులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.రాష్ట్ర రాజధానిలో హాస్టల్ భవనం కోసం లక్ష రూపాయలు విరాళంగా అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు.ఒక మహిళగా ముందడుగు వేయాలంటే ఎంత కష్టమో అందరికీ తెలుసాని,అలాంటి తనకు తోడు నీడగా ఉంటూ రాష్ట్ర అధ్యక్షులు వెంకట యాదవ్ ప్రోత్సహిస్తూ ఉండటం సంతోషంగా ఉందన్నారు.ఎన్ని ఆటంకాలు వచ్చినా వెనకడుగు వేయకుండా జాతిని చైతన్యం చేయడంతో పాటు,సంఘ నిర్మాణంతో పాటు విద్యార్థుల అభివృద్ధి విద్యా ఉద్యోగ రంగాల్లో ముందుకు తీసుకువెళ్లడంలో ముఖ్య భూమిక పోషిస్తామన్నారు.ఈ విలేకరుల సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ బైకని మహేష్ యాదవ్,ఎర్రం గణేష్ యాదవ్,ప్రధాన కార్యదర్శి గుజ్జ అశోక్ యాదవ్,కార్యదర్శి రాసగిరి యాదవ్,దినేష్ యాదవ్,స్పోక్స్ పర్సన్ ప్రవీణ్ యాదవ్,కోశాధికారి లక్ష్మణ్ యాదవ్,కార్యవర్గ సభ్యులు గంగాధర్ యాదవ్,శ్రీనివాస్ యాదవ్,సంజీవ్ యాదవ్,అనూష యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు పాటుపడాలి

- బీజేపీ అధ్యాత్మిక సెల్ సమావేశంలో ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ..



నిజామాబాద్, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :

జిల్లాలోని ఆలయాల పరిరక్షణకు పాటుపడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.బీజేపీ అధ్యాత్మిక సెల్ నూతన కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నూతనంగా ఏర్పడిన ఆధ్యాత్మిక సెల్ హిందూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.ప్రధానంగా జిల్లాలో చారిత్రాత్మక ఆలయాలు ఎన్నో ఉన్నాయన్నారు.వాటి భూముల పరిరక్షణ చేపట్టాలన్నారు.ఆలయాలపై దాడులు వ్యతిరేక కార్యకలాపాలను ఎదిరించి ఆసరాగా నిలవాలని సూచించారు.హిందువులందరినీ కలుపుకొని సంస్కృతి,సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు.ఆలయాల భూముల కబ్జాలను ఆక్రమణలను అడ్డుకోవాలని తెలిపారు.అనంతరం నూతన కమిటీలను నియమకపత్రాలను అందజేశారు.కార్యక్రమంలో బీజేపీ అధ్యాత్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ సూర్య ప్రకాష్ రావు,కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్,జాయింట్ కన్వీనర్ నవీన్,జిల్లా కన్వీనర్ మేఘా సుబేదార్,రాష్ట్ర సలహాదారు ఉదయ్ మహారాజు,జిల్లా కో కన్వీనర్ రాజేష్,చంద్ర కాంత్ తదితరులు పాల్గొన్నారు.

హయత్ నగర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి — కళ్లెం నవజీవన్ రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) :

క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బొల్లారంలోని జీసీసీ మైదానంలో అల్వాల్ యూత్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్వాల్ ప్రీమియర్ లీగ్ ఏడో సీజన్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన జట్లకు, క్రీడాకారులకు బహుమతులు అందజేసి అభినందించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని యువ క్రీడాకారులకు సూచించారు. క్రీడల ద్వారా జట్టుగా పనిచేసే తత్వం, స్నేహభావం, ఐక్యత పెంపొందుతాయని పేర్కొన్నారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచుతూ ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఫ్రాంక్లిన్, లియోనార్డ్, దినకర్, సామ్యూల్, ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు తోట నరేందర్‌రెడ్డి, అరుణ్‌రావు, భాస్కర్‌రెడ్డి, శోభన్‌బాబు, మహేష్, శరణ్‌గిరి, ప్రశాంత్, అరుణ్, అజయ్‌గౌడ్, మణికంఠ, క్రీడాకారులు, యువత పాల్గొన్నారు.



భద్రాద్రి డీఏవీ పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక సదుపాయాలు, బోధనా విధానాలు

మణుగూరు,నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్): తెలంగాణ జెన్‌కో పరిధిలోని వివిధ డీఏవీ విద్యాలయాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం బుధవారం భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ టౌన్‌షిప్‌లోని డీఏవీ ఉన్నత పాఠశాలను సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలోని అత్యాధునిక భవనం, కంప్యూటర్ ప్రయోగశాల, విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల, విశాలమైన క్రీడా మైదానం, వాహనాల పార్కింగ్ సదుపాయాలను పరిశీలించింది.చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న సారథ్యంలో, ఎస్ఈ (సివిల్), ఎస్ఈ (అడ్మిన్) పర్యవేక్షణలో పాఠశాల అభివృద్ధికి చేపట్టిన పనులను బృందం అభినందించింది. జాతీయస్థాయి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడి బోధనా విధానాలు, మౌలిక సదుపాయాలు ఉన్నాయని, ఇవి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడింది.వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ పాఠ్యప్రణాళిక అమలులోకి రానుండటం భద్రాద్రి ఉద్యోగుల పిల్లలకు మంచి అవకాశమని పేర్కొంది. పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసిన చీఫ్ ఇంజనీర్ బిచ్చన్నను బృంద సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు.





16వ వార్డులో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం

- పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం: చైర్‌పర్సన్ గడ్డం అనన్య

వికారాబాద్ (జర్నలిస్ట్ ఫైల్): వికారాబాద్: వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు. అనంతరం గృహప్రవేశం చేసిన కుటుంబానికి నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అనన్య మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి, 16వ వార్డు కౌన్సిలర్ పుష్పలత శ్రీకాంత్, ఇతర కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, మల్లికార్జున గౌడ్, వినోద్ కుమార్, విజయలక్ష్మి విజయ్, శశిరేఖ మధు, సుధాకర్, వి. రాఘవేందర్, బాజీ, మురళి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకే చెకుముకి సైన్స్ సంబురాలు

- కలెక్టర్ చేతుల మీదుగా ఘనంగా గోడప్రతుల ఆవిష్కరణ
- కచెకుముకి పరీక్షకు అన్ని పాఠశాలలు సహకరించాలని కలెక్టర్ ఆదేశం

నిజామాబాద్,నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్): ఆలోచనలు,పరిశీలన శక్తి,సృజనాత్మకతను పెంపొందించి,విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగించేందుకు 'చెకుముకి సైన్స్ సంబురాలు' ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.సమాజంలో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు,దాదాపు 40 ఏళ్లుగా జనవిజ్ఞాన వేదిక వివిధ రూపాల్లో చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు.జనవిజ్ఞాన వేదిక రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించే ఈ 'సైన్స్ టాలెంట్ టెస్ట్'లు ఈ నెల 12న పాఠశాల స్థాయి,21న మండల స్థాయి,28న జిల్లా స్థాయి పరీక్షలు..అలాగే జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి డిసెంబర్ 11,12,13 తేదీలలో రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్ లో నిర్వహించడం జరుగుతుందని జేవీవీ జిల్లా అధ్యక్షులు సక్కి ఉదయ్ కుమార్ తెలిపారు.అలాగే జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు అజయ్ కుమార్ మాట్లాడుతూ..పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు సైన్స్ పై ఆసక్తి పెంచడానికి ఈ 'టాలెంట్ టెస్ట్' చాలా ఉపయోగపడుతుందని పేర్కొనగా..ఈ అవకాశాన్ని అన్ని పాఠశాలలూ సద్వినియోగం చేసుకోవాలని చెకుముకి జిల్లా బాధ్యులు మల్లని శివ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా కమిటీ ముఖ్య సభ్యులు ఖెల్గే పండరి,సిహెచ్ గంగాధర్,బాస రాజేశ్వర్, పులి జైపాల్, రామ్మోహన్ రావు, డా.రవీంద్రనాథ్ సూరి, శ్రీహరి ఆచార్య,షకీల్ అహ్మద్,ఎంఏ బారి,బొడ్డు లక్ష్మణ్,తిమ్మాపురం దిలీప్, కే.గంగాధర్ , వి.గంగారాం, ఆర్. గిరి, వం శీరాజ్, గైక్వాడ్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



రెస్క్యూ యోధుల సాహసానికి మంత్రులు తుమ్మల, పొంగులేటి ప్రశంసలు

- 16 మందిని సురక్షితంగా కాపాడిన ఎన్ డిఆర్ఎఫ్, ఎస్ డిఆర్ఎఫ్ సిబ్బందికి అభినందనలు







సత్తుపల్లి, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) : సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో చోటుచేసుకున్న ప్రమాద ఘటనలో ప్రాణాలకు తెగించి సహాయక చర్యలు చేపట్టి 16 మందిని సురక్షితంగా కాపాడిన ఎన్ డిఆర్ఎఫ్, ఎస్ డిఆర్ఎఫ్ ఫైర్ సిబ్బందిని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రులు చెరువు ప్రాంతాన్ని వేర్వేరుగా సందర్శించి, సహాయక చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్ర మాద సమయంలో రాత్రంతా నీటిలో ఉండి, ఏమాత్రం ధైర్యం కోల్పోకుండా బాధితులను రక్షించేందుకు రెస్క్యూ సిబ్బంది చూపిన సాహసం, అంకితభావం, సమయస్ఫూర్తిని మంత్రులు ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విపత్తు సహాయక బృందాలను సన్మానించి వారి సేవలను కొనియాడారు.--- ఎమ్మెల్యే చొరవ, కలెక్టర్ పర్యవేక్షణకు ప్రత్యేక ప్రశంసలుప్ర మాదం జరిగినప్పటి నుంచి సహాయక చర్యలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి నిమిషానికో సారి పరిస్థితులను సమీక్షిస్తూ, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, సహాయక చర్యలను సమన్వయం చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌ను మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు.అదే విధంగా జిల్లా కలెక్టర్ దివాకర్ రాత్రంతా అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసిన తీరును మంత్రులు ప్రశంసించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ, సమన్వయం సహాయక చర్యల్లో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు.--- ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధు లకు మత్స్యకార కుటుంబాల కృతజ్ఞతలుఈ సందర్భంగా ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన మత్స్యకారులు, వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ దివాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రాణాపాయ పరిస్థితుల్లో తమకు అండగా నిలిచి, రాత్రంతా నిద్రాహా రాలు మాని సహాయక చర్యలను పర్యవేక్షించిన ప్రజాప్రతినిధులు, అధికారుల సేవలను వారు కొనియాడారు.మహిళా ఎమ్మెల్యే అయినప్ప టికీ ప్రమాద సమయంలో ఎలాంటి వెనుక డుగు వేయకుండా ధైర్యంగా ముందుండి సహాయక చర్యలను పర్యవేక్షించిన డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చొరవపై నియో జకవర్గ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజల కష్టాల్లో అండగా నిలిచే నాయకురాలు తమకు ఉండటం ఎంతో ధైర్యాన్ని ఇస్తోందని వారు పేర్కొన్నారు. ప్రాణాలను కాపాడేందుకు ప్రాణాలకు తెగించి పనిచేసిన రెస్క్యూ యోధుల సేవలు అభినందనీయం. వారి సాహసం, అంకితభావం సమాజానికి స్ఫూర్తిదాయకం.

బేతుపల్లి చెరువు వరద ఉధృతిలో చిక్కుకున్న 10 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 9 మంది మత్స్యకా రులను సురక్షితంగా రక్షించిన సహాయక బృందాలు

- ఎస్పీ రోహిత్ రాజు, కలెక్టర్ దివాకర్ టిఎస్ సమయస్ఫూర్తి, సమర్థవంతమైన పర్యవేక్షణతో విజయవంతమైన సహాయక చర్యలు







సత్తుపల్లి, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) : సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో వరద ఉధృతిలో చిక్కుకున్న 9 మంది మత్స్యకారు లను రక్షించేందుకు వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్, అగ్ని మాపక శాఖ సిబ్బంది బోట్లు వరద ప్రవాహంలో చిక్కుకున్నాయి. ఈ ఘటనలో 10 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 9 మంది మత్స్యకారులు ప్రమాదంలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. సమయస్ఫూర్తితో అదనపు సహాయక బృందాలను రంగంలోకి దించి, వివిధ శాఖల మధ్య సమన్వయం ఏర్పాటు చేసి వరద ఉధృతిలో చిక్కుకున్న వారందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు చర్యలు చేపట్టారు.జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ కూడా సంఘటనా స్థలానికి చేరుకుని పరి స్థితిని సమీక్షించారు. సహాయక చర్యల పురో గతిని తెలుసుకుని, అవసరమైన సూచనలు చేస్తూ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న వారిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందరూ సురక్షి తంగా బయటపడటంతో పోలీసు శాఖ, ప్రభుత్వ యంత్రాంగం, వారి కుటుంబ సభ్యులు ఊరట చెందారు.ఈ సందర్భంగా సహాయక చర్యల్లో పాల్గొన్న పోలీసు, ఎస్డీఆ ర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని ఎస్పీ అభి నందించారు.ప్రాణాలను కాపాడడంలో పోలీసు శాఖ చూపిన చొరవ, ఎస్పీ రోహిత్ రాజు , కలెక్టర్ దివాకర్ టిఎస్ సమయస్ఫూ ర్తితో కూడిన పర్యవేక్షణ, వివిధ శాఖల మధ్య సమన్వయంతో సహాయక చర్యలు విజయ వంతంగా ముగిసాయి.

బేతుపల్లి చెరువు బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

సత్తుపల్లి, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లి వరద ఉద్ధృతిలో చిక్కుకున్న మత్స్యకారులు, వారిని రక్షించేందుకు వెళ్లిన ఎస్ డిఆర్ఎఫ్ , ఫైర్ సిబ్బందిని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పరామర్శించారు. సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి బాధితుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. బాధితు లకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.ప్రా ణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న ఎస్ డి ఆర్ ఎఫ్ , ఫైర్ సిబ్బంది సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, అద్దంకి అనిల్, గుండ్ర రఘు, పర్వతనేని వేణు తదితరులు ఉన్నారు.



శభాష్, ఎస్డీఆర్ఎఫ్

- వరద సహాయక చర్యల్లో మీ సేవలు మరువలేనివి
- సిబ్బందిని అభినందించిన మంత్రి పొంగులేటి



ఖమ్మం, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్): భారీ వర్షాలు, వరదలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న వేళ ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆ ర్ఎఫ్) సిబ్బంది సేవలు మరువలే నివని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. బేతుపల్లి చెరువు ఉప్పొంగిన ప్రాంతంతో పాటు దమ్మపేట మండలంలోని పలు గ్రామాలకు వరద ముప్పు ఏర్పడిన సమయంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తక్షణమే స్పందించి చేపట్టిన సహాయక చర్యలను అభినందించారు.గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి పొంగులేటి సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువు వద్ద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం దమ్మపేట మండలంలో మల్లెపూల వాగు, ముసలిబంధం చెరువుల వద్ద గండ్లు పడిన ప్రాంతాలను సందర్శించి వరద పరిస్థితులను సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. వారికి శాలువాలు కప్పి సత్కరించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు చూపిన ధైర్యసాహసాలు, అంకిత భావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో చూపిన తెగువకు ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు.

కలెక్టర్ దివాకర్ కు అభినందనలు తెలిపిన నూతి సత్యనారాయణ గౌడ్





ఖమ్మం, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్): జిల్లా కలెక్టర్ దివాకర్ కు, అధికార యంత్రాంగానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రశంసలు అందజేశారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద అధికార యంత్రాంగం ప్రదర్శించిన సమర్థవంతమైన సమన్వయం ,అప్రమత్తత,విజయవంతమైన రక్షణ చర్యలను అభినందించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్. గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న పరిస్థితులు నెలకొన్న వేళ ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం సిబ్బంది సేవలు మరువలేని వని అన్నారు. బేతుపల్లి చెరువు ఉప్పొంగిన ప్రాంతంతో పాటు దమ్మపేట మండలంలో పలు గ్రామాలకు ముప్పు ఏర్పడిన సమయంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తక్షణమే స్పందించి చేపట్టిన చర్యలను అభినందించారు. అదే విధంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రతి గురువారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని అదే విధంగా ఈరోజు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించామని అన్నారు. ఈనాటి ప్రజావాణిలో 38 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఈ దరఖాస్తులను జిల్లా మంత్రులు ,శాసనసభ సభ్యులు,అధికారులతో కలిసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

మిర్చి తోటలను క్షేత స్థాయిలో పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్



ఖమ్మం, నవంబరు 06 (జర్నలిస్ట్ ఫైల్): ఖమ్మం జిల్లా, వేంసూరు మండలం కల్లూరు గూడెం, వైరా మండలం ఖానాపురం గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొలిగిన మిరప తోటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.వి. మధుసూదన్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట పరిస్థితిని, నష్టం వివరాలను తెలు సుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలాల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువల ద్వారా బయటకు పంపించాలని, మొక్కల మొదళ్ల వద్ద మట్టిని ఎగదోసి తిరిగి నిలదొక్కుకునేలా చేయాలని సూచించారు. పాలంలో తేమ అధికంగా ఉన్నప్పుడు నీటి తడులు, ఎరువుల వాడకం నిలిపివేయాలన్నారు.అధిక తేమ కారణంగా వేరుకుళ్లు, కొమ్మకుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉన్నందున తోటలను నిత్యం పరిశీలించాలని సూచించారు. తెగుళ్ల లక్షణాలు కనిపిస్తే ఉద్యాన శాఖ అధికారుల సలహా మేరకు తగిన నివారణ చర్యలు చేపట్టాలని, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం గ్రామంలో వైరా ఉద్యాన అధికారి ఆకుల వేణు, కల్లూరుగూడెం గ్రామంలో సత్తుపల్లి ఉద్యాన అధికారి శ్రావణితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

రోడ్ కారిడార్లు, జంక్షన్ల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



- 12 ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం ప్రారంభించాలి : నగర కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): నగరంలో రోడ్ కారిడార్లు, ప్రధాన జంక్షన్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి అభివృద్ధి పనికి నిర్దిష్ట గడువు నిర్ణయించుకుని, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఇంజినీరింగ్, ఉద్యానవన విభాగాల అధికారులతో నగర అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

నగర అభివృద్ధిలో కీలకమైన రోడ్ కారిడార్లు, జంక్షన్ల ఆధునికీకరణ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. అలాగే పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి గుర్తించిన 12 ప్రాంతాల్లో వెంటనే పనులు ప్రారంభించాలని, స్థల సమస్యలు ఎదురైతే డిప్యూటీ సిటీ ప్లానర్‌తో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

నగరంలో పచ్చదనం పెంపునకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. పార్కుల అభివృద్ధితోపాటు రోడ్ల మధ్య డివైడర్లలో అవెన్యూ ప్లాంటేషన్ పనులను త్వరితగతిన చేపట్టాలని చెప్పారు. ఇప్పటికే నాటిన మొక్కలను అందంగా తీర్చిదిద్దేలా క్రమం తప్పకుండా ట్రిమ్మింగ్ చేయాలని, మొక్కల పెరుగుదలకు నగరపాలక సంస్థ తయారు చేస్తున్న వర్మీ కంపోస్ట్‌ను వినియోగించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.

కొత్తగా చేపట్టే ప్లాంటేషన్ నిర్వహణ బాధ్యతను రెండేళ్లపాటు సంబంధిత కాంట్రాక్టర్లే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు.

సమీక్షా సమావేశంలో ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, ఈఈ వేణుగోపాల్, డీఈఈ శ్రీనివాస్, ఏడీహెచ్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో జలకళ..



- రిజర్వాయర్లలోకి కొత్త నీరు.. ఎక్కడ ఎంతంటే?
- భారీ వర్షాలతో ఏపీ జలాశయాల్లోకి చేరిన కొత్త నీరు
- మొత్తం 505.76 టీఎంసీలకు పెరిగిన నీటి నిల్వలు ప్రధాన జలాశయాల్లో మిశ్రమంగా నీటిమట్టాలు
- శ్రీశైలం, సోమశిల ప్రాజెక్టులలో ఇంకా తక్కువగానే నీరు
- రాష్ట్రవ్యాప్తంగా 10.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు

అమరావతి, నవంబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు జలాశయాల్లోకి కొత్తగా నీరు వచ్చి చేరింది. రాష్ట్ర జలవనరుల శాఖ గణాంకాల ప్రకారం, ప్రస్తుతం రిజర్వాయర్లలో మొత్తం 505.76 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

ఇది జలాశయాల పూర్తి సామర్థ్యం 1,161.36 టీఎంసీలలో సుమారు 43.51 శాతానికి సమానం. వర్షాలు కొనసాగితే మరో 655.59 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉందని అధికారులు తెలిపారు.

నదీ బేసిన్ల వారీగా చూస్తే, కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులలో అత్యధికంగా 318.27 టీఎంసీలు (42.47% సామర్థ్యం), పెన్నా బేసిన్‌లో 107.74 టీఎంసీలు (36.47%), గోదావరి బేసిన్‌లో 20.51 టీఎంసీలు (76.72%) నిల్వ ఉన్నాయి. ఇతర బేసిన్లలోని ప్రాజెక్టులలో కలిపి 58.72 టీఎంసీల నీరు ఉంది.

అయితే, ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు మిశ్రమంగా ఉన్నాయి. శుక్రవారం నాటి లెక్కల ప్రకారం, శ్రీశైలం డ్యామ్‌లో 215.81 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను కేవలం 51.60 టీఎంసీల (23.9%) నీరు మాత్రమే ఉంది. ఇక్కడ నీటిమట్టం 885 అడుగులకు గాను 832 అడుగుల వద్ద ఉంది. నాగార్జున సాగర్‌లో 180.91 టీఎంసీలు (58%), పులిచింతలలో 28.19 టీఎంసీల (61.6%) నీరు నిల్వ ఉంది.

మరోవైపు, పెన్నా బేసిన్‌లోని సోమశిల ప్రాజెక్టులో 19.74 టీఎంసీలు (25.3%), కండలేరులో 16.70 టీఎంసీలు (24.6%) ఉన్నాయి. అదే సమయంలో, గండికోట (69.5%), గోరకల్లు (78.8%), ఏలేరు (91%) వంటి రిజర్వాయర్లలో నీటిమట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి.

ఇదిలా ఉండగా, నవంబరు 4 ఉదయం 8.30 గంటల నుంచి నవంబర్ 5 ఉదయం 8:30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటున 10.3 మి.మీ వంతున వర్షపాతం నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

మొత్తం మీద రాష్ట్రంలో నీటి నిల్వలు పెరిగినప్పటికీ, శ్రీశైలం వంటి కీలక ప్రాజెక్టులు నిండాలంటే భారీ వర్షాలు అవసరమని స్పష్టమవుతోంది.

కూటమి ఐక్యతతోనే ప్రజా సంక్షేమం, సమగ్రాభివృద్ధి

- కార్పొరేటర్లు అంకితభావంతో పనిచేయాలి: గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): ఎన్డీయే కూటమి ఐక్యతే ప్రజా సంక్షేమానికి, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి బలమైన పునాది అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. శుక్రవారం ఆమె అధ్యక్షతన నియోజకవర్గ ఎన్డీయే కూటమి కార్పొరేటర్లు, అభ్యర్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ చిన్నపాటి అభిప్రాయభేదాలు ఉన్నా కుటుంబ సభ్యుల్లా చర్చించుకుని పరిష్కరించుకోవాలని, మూడు పార్టీల నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, మరోసారి కూటమి అధికారాన్ని కోల్పోయే పరిస్థితి రాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

2024 ఎన్నికల్లో ప్రజలు తనకు 50 వేల మెజారిటీ అందించారని, అదే విధంగా మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు కూడా భారీ మెజారిటీతో విజయాన్ని అందించామని తెలిపారు. కార్పొరేటర్ల విజయానికి కృషిచేసిన నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులను విస్మరించకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రతి కార్పొరేటర్ తమ డివిజన్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. స్థానిక సమస్యలను మేయర్ దృష్టికి తీసుకెళ్లి, అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. మహిళా ప్రజాప్రతినిధులు కూడా ఆదర్శవంతమైన ప్రజాసేవతో నగరాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్లు దేగల ప్రభాకర్, మల్లె ఈశ్వర్ రావు, బుచ్చి రామ్ ప్రసాద్, మద్దిరాల మ్యానీ, తాళ్ల వెంకటేష్ యాదవ్, కనపర్తి శ్రీనివాసరావు, మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, జనసేన నాయకుడు కిలారి రోశయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు తదితర నాయకులు, నూతన కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి : ఎమ్మెల్యే నసీర్

- సీఎం చంద్రబాబు సారథ్యంలో పని చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- ఇప్పటి నుంచే డివిజన్లలో సమస్యలను గుర్తించండి
- నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లకు ఎమ్మెల్యే నసీర్ దిశానిర్దేశం



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ను కలిసేందుకు వచ్చిన నియోజకవర్గ కార్పొరేటర్లు ఎమ్మెల్యే నసీర్ దిశా నిర్దేశం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేయాలని సూచించారు. ఇప్పటి నుంచే డివిజన్లో సమస్యలను గుర్తించాలని చెప్పారు ప్రతి సమస్య పరిష్కారానికి పక్క ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సమస్యలు ఏ అధికారి వద్దకు తీసుకెళ్తే పరిష్కారం అవుతాయో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో 400 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్పొరేటర్లు ముందంజలో ఉండాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యనూ ప్రభుత్వాధికారులు దృష్టికిగానీ, మా దృష్టికిగానీ వెంటనే తీసుకురావాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత కార్పొరేటర్లదేనని స్పష్టం చేశారు . నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ సారథ్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు

- ప్రభుత్వ నిబంధనలు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): దీపావళి నేపథ్యంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేయడం, విక్రయించడం, తయారు చేయడం వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే పేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. బాణసంచా వ్యాపారులు ముందస్తు అనుమతులు, లైసెన్సులు పొందిన తర్వాతే వ్యాపారం నిర్వహించాలని సూచించారు. నివాస ప్రాంతాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయరాదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయించిన బహిరంగ ప్రదేశాల్లోనే విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి దుకాణంలో నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. దుకాణాల్లో పనిచేసే సిబ్బందికి అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, చిన్నపిల్లలను విక్రయ పనుల్లో నియమించరాదని తెలిపారు. గతంలో జరిగిన అగ్నిప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. అక్రమంగా బాణసంచా నిల్వలు, విక్రయాలపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, అనుమతులు లేని దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

అక్రమ బాణసంచా నిల్వలు, విక్రయాల గురించి ప్రజలు డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

చీరాల మున్సిపాలిటీలో అనూహ్య ఫలితాలు.. 10 వార్డుల్లో గెలిచిన కాంగ్రెస్

- చీరాల మున్సిపల్ ఎన్నికల్లో ఖాతా తెరిచిన కాంగ్రెస్
- 1, 21, 25, 33వ వార్డులతో పాటు మరో 6 కైవసం చేసుకున్న హస్తం పార్టీ
- మాజీ ఎమ్మెల్యే అమంచి కృష్ణమోహన్ ప్రభావమే కారణమంటున్న విశ్లేషకులు

చీరాల (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ పురపాలక ఎన్నికల ఫలితాల్లో బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీ ఫలితాలు ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అధికార టీడీపీ కూటమి హవా కొనసాగినప్పటికీ, చీరాలలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ ఏకంగా 10 వార్డులను కైవసం చేసుకుని దశాబ్ద కాలం తర్వాత తన ఉనికిని చాటుకుంది. వాస్తవానికి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 3న జరిగింది. అయితే మురసు తుపాను ప్రభావంతో చీరాలలో కౌంటింగ్ నవంబరు 6కి వాయిదా పడింది. ఈ నేపథ్యంలో, నేటి ఓట్ల లెక్కింపులో ఆశ్చర్యకర ఫలితాలు వెలువడ్డాయి.

చీరాలలో కాంగ్రెస్ ఈ స్థాయిలో విజయం సాధించడం వెనుక మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌లో చేరిన ఆమంచి కృష్ణమోహన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వడమే కాకుండా, విజయకేతనం ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 1, 21, 25, 33వ వార్డులతో పాటు మరో 6 వార్డులలో విజయం సాధించారు. ముఖ్యంగా 25వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి వెంకట్రావు.. బీజేపీ, వైసీపీ అభ్యర్థులను వెనక్కి నెట్టడం గమనార్హం.

రాష్ట్రంలో ఉనికి కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఫలితాలు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ విజయంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) హర్షం వ్యక్తం చేసింది. సోషల్ మీడియా వేదికగా విజేతలకు శుభాకాంక్షలు తెలిపింది. "ప్రజలు మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజాసేవలో ముందుండి, వార్డుల అభివృద్ధికి కృషిచేయాలి" అని ఆకాంక్షించింది. పూర్తిస్థాయి ఫలితాలు ఇంకా వెలువడాల్సి ఉన్నప్పటికీ, చీరాలలో కాంగ్రెస్ ప్రదర్శన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

నిర్మలా ఫార్మసీ కళాశాలలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): ప్రజారోగ్య పరిరక్షణ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా మంగళగిరిలోని నిర్మలా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (స్వయంప్రతిపత్తి)లో జాతీయ సేవా పథకం, ఫార్మసీ ప్రాక్టీస్ అండ్ ఫార్మకాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.

ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులకు ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, మధుమేహ పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మాక్సివిజన్ ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత కంటి పరీక్షలు, కంటి వైద్య నిపుణుల సంప్రదింపులు నిర్వహించారు. కోనాక్ డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఉచిత మధుమేహ, ఆరోగ్య పరీక్షల్లో భాగంగా రక్తంలో చక్కెర స్థాయిల పరీక్షలు, రక్తపోటు, బరువు, BMI పరీక్షలు నిర్వహించారు. అరుణ



డెంటల్ హాస్పిటల్ సహకారంతో ఉచిత దంత పరీక్షలు నిర్వహించి దంత ఆరోగ్యం, నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అదనంగా ఉచిత సాధారణ వైద్య సంప్రదింపులు, బ్లడ్ ప్రెషర్, రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలు, BMI పరీక్షలు, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు మరియు ఉచిత మందుల పంపిణీ వంటి సేవలను అందించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రస్తుత జీవనశైలిలో మధుమేహం, కంటి సమస్యలు, దంత సమస్యలు, రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు ఆరోగ్య పరీక్షలు, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం, సరైన వైద్య సలహాలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు, సామాజిక బాధ్యతను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవ. సిస్టర్ జి. నిర్మల జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి తమ శుభాకాంక్షలు అందించారు. ప్రజారోగ్య పరిరక్షణకు దోహదపడే ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొంటూ, కార్యక్రమ నిర్వాహకులు, వైద్య నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. రేఖా నరేష్ బాబు, ఫార్మసీ ప్రాక్టీస్ అండ్ ఫార్మకాలజీ విభాగాధిపతి డా షేక్ ఫైజాన్ అలీ, అధ్యాపకులు జోయెల్, వి జోజి బాబు వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

NSS విద్యార్థి సమన్వయకర్తలు వి. పోషిణి, వి. లిఖిత, ఎస్. కుసుమ శ్రీ, సి. హెచ్. నాగేశ్వరరావు, ఎ. దివ్యాంజలి, టి. చంద్రిక, టి. సాయి మనోజ్ఞ, సి. హెచ్. ఆకాష్ తదితరులు శిబిరం నిర్వహణలో చురుకుగా పాల్గొని తమ సహకారం అందించారు. వాలంటీర్లు కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ కౌంటింగ్‌కు పటిష్ట పోలీస్ బందోబస్తు

- విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు.. గుంపులుగా గుమిగూడితే చర్యలు
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో రేపు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పటిష్టమైన పోలీస్ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, పెదకాకాని, వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాల, తెనాలిలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించే అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బందిని నిబంధనల ప్రకారం తనిఖీ చేసిన అనంతరమే అనుమతించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత అభ్యర్థులు, వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వెలుపల, పరిసర ప్రాంతాల్లో ప్రజలు గుంపులుగా గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద కూడా నిరంతర నిఘా ఉంచాలని సూచించారు.

ఫలితాల అనంతరం అభ్యర్థులు, వారి అనుచరుల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు బలగాలను సిద్ధంగా ఉంచడంతో పాటు పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గతంలో అల్లర్లకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్లు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నవారి కదలికలపై ముందస్తు నిఘా ఉంచాలని ఆదేశించారు.

కౌంటింగ్ అనంతరం ఎవరైనా ఘర్షణలు, అల్లర్లు సృష్టించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిసేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు.. మంత్రి పొన్నం సీరియస్!

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) వ్యవహారశైలిపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. కార్మికులతో సమావేశమైన సమయంలో డీఎం కుర్చీలో కూర్చోగా, కార్మికులు నేలపై కూర్చున్నట్లుగా ప్రచారంలోకి వచ్చిన ఘటనపై ఆయన పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "సిద్దిపేట డిపోలో జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై తక్షణమే ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించాను. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. "ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను గౌరవంగా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంది.

పుట్టినరోజును సామాజిక బాధ్యతగా మార్చడం అభినందనీయం



- తలసేమియా రహిత భారతావని కోసం 79 ఏళ్ల వయసులోనూ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి కృషి స్ఫూర్తిదాయకం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): పుట్టినరోజును వేడుకలకే పరిమితం చేయకుండా సామాజిక బాధ్యతగా భావించి రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. శుక్రవారం లక్ష్మీపురంలోని శ్రీ చైతన్య ఐకాన్ క్యాంపస్‌లో విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి 79వ జన్మదినం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై రక్తదాతలను అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు ముందుండటం అభినందనీయమన్నారు. తలసేమియా బాధిత చిన్నారుల కష్టాలను గుర్తించి, తలసేమియా రహిత భారత్ లక్ష్యంతో 79 ఏళ్ల వయసులోనూ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి రక్తదాన శిబిరాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

రక్తదానం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ ఈ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి సంపూర్ణ ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాలు సమాజసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్, సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వివిధ విభాగాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్కులేషన్ మేనేజర్
76 61 80 59 68

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా 161 పీజీ సీట్లు మంజూరు

- 11 కళాశాలల్లో 15 వైద్య విభాగాల్లో సీట్లకు ఎన్ఎంసీ అనుమతులు
- 163 సీట్లకు ప్రతిపాదనలు.. 98.77 శాతం సాధన
- మెరిట్ విద్యార్థులకు పీజీ వైద్య విద్య మరింత చేరువ

అమరావతి, నవంబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి 161 కొత్త పీజీ వైద్య సీట్లను జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) మంజూరు చేసింది. మొత్తం 15 స్పెషాలిటీల్లో ఈ సీట్లు వచ్చాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి 163 సీట్లకు ప్రతిపాదనలు పంపగా ఎన్ఎంసీ 161 సీట్ల (98.77 శాతం)కు అనుమతించింది. కూటమి ప్రభుత్వం సదరు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా బోధనా సిబ్బంది నియామకాలు, పడకల పెంపు, వైద్య పరికరాలు, మౌలిక వసతులను కల్పించడం ద్వారా 161 సీట్లు అదనంగా రావడంతో మెరిట్ విద్యార్థులకు పీజీ వైద్య విద్య మరింత చేరువైంది.

ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్లు

వైద్య విభాగాల వారీగా ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్లు మంజూ-రయ్యాయి. చర్మ, సుఖ వ్యాధుల విభాగం (డీవీఎల్), ఈఎన్‌టీ, పాథాలజీ విభాగాల్లో 16 చొప్పున, రేడియో డయాగ్నోసిస్ 14, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ విభాగాల్లో 12 చొప్పున, జనరల్ మెడిసిన్, అనస్థీషియాలజీ, ఆప్తాల్మాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్ విభాగాల్లో 8 చొప్పున, ఎమర్జెన్సీ మెడిసిన్, ప్రసూతి, గైనకాలజీ, సైకియాట్రీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల్లో 4 చొప్పున సీట్లు లభించాయి. ఎమర్జెన్సీ మెడిసిన్, రెస్పిరేటరీ మెడిసిన్, సైకియాట్రీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల్లో మంజూరైన సీట్లు అత్యవసర చికిత్స, శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఆరోగ్యం, క్యాన్సర్ చికిత్స వంటి ప్రాధాన్య రంగాల్లో వైద్య నిపుణుల సంఖ్యను పెంచనున్నాయి. ప్రస్తుతం మంజూరైన 161 సీట్లను 2026--27 విద్యా సంవత్సర పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు.

కిందటి విద్యా సంవత్సరంలో 13 ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి మొత్తం 150 పీజీ వైద్య విద్య సీట్ల మంజూరుకు దరఖాస్తులు వెళ్లాయి. వీటి పరిశీలన అనంతరం ఎన్ఎంసి 142 సీట్లను మంజూరు చేసింది.

చెప్పిన అబద్ధాన్నే వందసార్లు చెప్పడం జగన్ నైజం



- ఉద్యోగులకు ఒక్క డీఏ కూడా ఇవ్వకుండా దగా చేశారు
- ఇప్పుడు విక్టిమ్ కార్డుతో మొసలి కన్నీరు: టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) : 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా పూర్తిస్థాయిలో నిలబెట్టుకోని జగన్ మోహన్ రెడ్డి నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ విమర్శించారు. ఒకే అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమవుతుందనే భ్రమలో జగన్ ఉన్నారని, ప్రజలు ఆయన ఐదేళ్ల పాలనను మరిచిపోలేదని అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 151 సీట్ల నుంచి 2024 ఎన్నికల్లో 11 సీట్లకు వైసీపీ పడిపోవడానికి జగన్ విధానాలే కారణమని పేర్కొన్నారు.

మద్యనిషేధం, ప్రత్యేక హోదా, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ వంటి హామీలను అమలు చేయకుండా యువతను, మహిళలను మోసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లలో ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని, పీఆర్సీ, హెచ్ఆర్ఏ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో అన్యాయం చేశారని విమర్శించారు. సీపీఎస్ రద్దు, పోలీసులకు వీక్లీ ఆఫ్ హామీలను కూడా విస్మరించారని అన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించిన రాజేష్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 19 రోజుల్లోనే పెన్షన్ల పెంపు హామీని అమలు చేసిందన్నారు. 63 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పెట్టుబడులు, పరిశ్రమలు, గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

వైసీపీ హింస, దౌర్జన్యాలు, బూత్ క్యాప్చరింగ్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని రాజేష్ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో పాటు ప్రచారం నిర్వహించారని, పోలింగ్ బూత్‌లలో ఏజెంట్లుగా కూడా ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే జగన్ విక్టిమ్ కార్డు ప్రయోగిస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ప్రజా తీర్పును గౌరవించి, ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.

బాలరాజు యాదవ్ అరెస్ట్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ విమర్శలకు పోలీసు కేసులతో బదులివ్వడం దుర్మార్గమని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని హెచ్చరించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ భార్య ఇందుజా రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు.

కేటీఆర్, హరీశ్ రావులపై బల్మూర్ వెంకట్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బాలరాజు యాదవ్ ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై అట్రాసిటీ కేసు పెట్టడం రాజకీయ కక్ష సాధింపేనని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.

ఈ అరెస్టుపై కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. “రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను సిటీ అంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు” అని కేటీఆర్ పేర్కొన్నారు.

బాలరాజు యాదవ్‌పై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కాలరాయలేరని హితవు పలికారు. ఈ అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా ఖండించారు.

తుఫాను బాధితులకు కొండంత భరోసా ఇచ్చిన మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్): ‘మురసు’ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలకు ముంపునకు గురైన నిడదవోలు నియోజకవర్గంలో మంత్రి కందుల దుర్గేష్ విస్తృతంగా పర్యటించి బాధితులకు అండగా నిలిచారు. ఇందిరానగర్, రాయిపేట, తీరుగూడెం, ఆంజనేయపురం, తాళ్లపాలెం, తిమ్మరాజుపాలెం తదితర ప్రాంతాల్లో మోకాల్లోతు నీటిలో నడుస్తూ, బైక్‌లు, ట్రాక్టర్లు, ఎన్డీఆర్ఎఫ్ బోట్ల ద్వారా పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు.

రోడ్డు మార్గాలు లేని ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం 30 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, ఫైర్ సిబ్బందిని రంగంలోకి దించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు భోజనాలు అందించడంతో పాటు మంత్రి స్వయంగా ఆహారం వడ్డించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచారు.

సురక్షిత తాగునీరు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గర్భిణులు, చిన్నారుల కోసం అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. ఎర్రకాలువ గేట్లు మూసివేసి నీటి ప్రవాహాన్ని నియంత్రించినట్లు వెల్లడించారు.

పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి రైతులకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించి దాణా అందిస్తున్నట్లు తెలిపారు. పెరవలి మండలంలోని ముత్యాలవారిపాలెం, ముక్కామల ప్రాంతాల్లోనూ సహాయక చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ప్రజలు మరో రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని మంత్రి సూచించారు. విపత్కర పరిస్థితుల్లో అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యలు చేపట్టడాన్ని అభినందించారు. ఆపద సమయంలో స్వయంగా తమ వద్దకు వచ్చి భరోసా కల్పించిన మంత్రికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ భేటీ

- జె.వి. నారాయణకు అభినందనలు తెలిపిన పార్టీ నాయకులు





విజయవాడ, నవంబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్): గిద్దలూరు మున్సిపల్ చైర్మన్‌గా విజయం సాధించిన బీజేపీ నాయకుడు జె.వి. నారాయణ శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనతో కొద్దిసేపు సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన జె.వి. నారాయణకు పీవీఎన్ మాధవ్ అభినందనలు తెలియజేశారు. స్థానిక సంస్థల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, బీజేపీ సెల్స్ జాతీయ కో-కన్వీనర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా తదితరులు పాల్గొని జె.వి. నారాయణకు అభినందనలు తెలిపారు.

జగన్ కుట్రలు చేసినా కూటమి మరింత బలపడింది

- స్థానిక ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి గుణపాఠం చెప్పారు: బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తెలిపారు. కూటమిని విచ్ఛిన్నం చేసేందుకు వైసీపీ అధినేత జగన్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. ఎన్నికలను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేయడం, కడప, పులివెందుల ప్రాంతాల్లో ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నించడం వంటి చర్యలను ప్రజలు తిరస్కరించారని విమర్శించారు.

విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ, ఒక్క స్థానం కూడా ఏకగ్రీవం కాకూడదని చెప్పిన జగన్ తన సొంత నియోజకవర్గంలో ఏకగ్రీవాలు జరగడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడలో వంగవీటి రాధాకృష్ణ ఘన విజయం సాధించడంతో పాటు విశాఖపట్నం సహా పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కూటమి అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. బీజేపీ కూడా జమ్మలమడుగులో పూర్తి స్థాయి విజయం సాధించిందని, అనంతపురంలో అంతర్గత సమన్వయ లోపాలను సరిదిద్దుకుంటామని పేర్కొన్నారు.

జగన్ రాజకీయాలు అధికారాన్ని తిరిగి దక్కించుకోవడం చుట్టూనే తిరుగుతున్నాయని, అమరావతి, పోలవరం అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆదినారాయణ రెడ్డి ఆరోపించారు. కేంద్ర సహకారంతో రాష్ట్రానికి పరిశ్రమలు, బుల్లెట్ రైలు, డేటా సెంటర్లు వంటి భారీ ప్రాజెక్టులు వస్తున్నాయని, ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు, అక్రమాస్తులు, లడ్డూ వివాదం తదితర అంశాలను ప్రస్తావిస్తూ జగన్ ఇతరులపై విమర్శలు చేసే ముందు తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని అన్నారు.

కూటమి ఐక్యతను దెబ్బతీసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజల మద్దతుతో మరింత బలంగా ముందుకు సాగుతామని తెలిపారు. తాము రిగ్గింగ్‌కు పాల్పడలేదని, ప్రజల తీర్పుతోనే విజయం సాధించామని స్పష్టం చేశారు.

ఆత్మస్థైర్యంతో కోలుకుంటున్న గోపిక



- త్వరలో పాఠశాలకు వెళ్లి పదో తరగతి పరీక్షలు రాస్తానంటున్న విద్యార్థిని: మంత్రి సవిత

బెంగళూరు: రాప్తాడు దాడిలో గాయపడిన విద్యార్థిని గోపిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శుక్రవారం బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపికను ఆమె పరామర్శించారు. గురువారం నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైందని, వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారని వెల్లడించారు.

గోపిక త్వరలో పాఠశాలకు వెళ్లి పదో తరగతి పరీక్షలు కూడా రాస్తానని ఆత్మస్థైర్యంతో చెబుతోందని మంత్రి తెలిపారు. తనకు మెరుగైన వైద్యం అందిస్తున్న మంత్రి నారా లోకేశ్‌కు విద్యార్థిని కృతజ్ఞతలు తెలిపిందన్నారు. బాధితురాలి వైద్యాన్ని ప్రభుత్వ అధికారులు, ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆమె కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

హంతకులకు జగన్ అండగా నిలుస్తున్నారు: జగన్ నిందితులకు న్యాయ సహకారం అందిస్తూ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి సవిత విమర్శించారు. రాప్తాడు ఘటనలో నిందితుడిని కాపాడేందుకు హైకోర్టులో పిల్ దాఖలు చేయించారని ఆరోపించారు. ఈ కేసులో నిందితుడికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మహిళలు, బాలికల భద్రతకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. మహిళలపై వేధింపులు, దాడులకు పాల్పడేవారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. గోపిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఆమె త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

చీరాలలో 10 స్థానాల్లో గెలుపు..



చీరాల (జర్నలిస్ట్ ఫైల్): చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సాధించిన విజయాన్ని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ప్రశంసించారు. ఈ ఫలితాల్లో కీలక పాత్ర పోషించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

44 స్థానాల్లో భాగంగా కాంగ్రెస్ 42 చోట్ల అభ్యర్థులను నిలబెట్టింది. వారిలో 10 మందిని గెలిపించడంతో పాటు, మిగతా స్థానాల్లోనూ పార్టీని రెండో స్థానంలో నిలబెట్టడంలో ఆమంచి ప్రత్యక్షంగా కృషి చేశారని షర్మిల పేర్కొన్నారు. “కాంగ్రెస్ సారథ్యంలో చీరాలలో అభ్యర్థుల గెలుపు మీ కష్టానికి దక్కిన ప్రతిఫలం. స్థానికంగా ప్రజా సమస్యలపై మీ అకుంఠిత పోరాట పటిమకు నిదర్శనం” అని ఆమె అన్నారు. చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం నిజమైన ప్రజాస్వామ్య విజయమని, రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయమనడానికి ఇదొక సంకేతమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రజల గొంతుకను నొక్కిపట్టాలని చూసిన కూటమి శక్తులను ఎదురించి, అధికార బలాన్ని తట్టుకుని, ప్రలోభాలకు లొంగకుండా ప్రజా పక్షాన నిలిచి గెలిచిన వార్డు సభ్యులను షర్మిల అభినందించారు. అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు, కాంగ్రెస్ అభ్యర్థులను నమ్మి ఓటేసిన చీరాల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోలేకపోయినా, గౌరవప్రదమైన స్థానాలు దక్కించుకుని ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్న కాంగ్రెస్‌దే చీరాలలో అసలైన నైతిక విజయమని ఆమె అన్నారు.

చీరాల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కూటమి నిర్లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు ఎండగట్టేలా అసలైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని ఆమె సూచించారు. గెలుపొందిన కాంగ్రెస్ వార్డు సభ్యులు అంకితభావంతో పనిచేస్తారని ఆశిస్తున్నట్లు షర్మిల తెలిపారు.

పల్లెలను సర్వనాశనం చేసిన వైసీపీకి ఓటడిగే అర్హత లేదు

- పంచాయతీ నిధులు దారిమళ్లించి గ్రామీణ వ్యవస్థలను నిర్వీర్యం చేశారు: మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు విమర్శించారు. కేంద్రం 14, 15వ ఆర్థిక సంఘాల ద్వారా పంచాయతీలకు కేటాయించిన సుమారు రూ. 12 వేల కోట్ల నిధులను జగన్ ప్రభుత్వం దారిమళ్లించిందని ఆరోపించారు. నిధుల కొరతతో పంచాయతీల్లో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేని పరిస్థితి ఏర్పడిందని శుక్రవారం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు.

ఉపాధి హామీ పథకంలో సుమారు రూ. 3 వేల కోట్ల విలువైన పనిదినాలను బోగస్ పేర్లతో దుర్వినియోగం చేశారని, రైతులకు ధాన్యం బకాయిలు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు సకాలంలో అందించలేదని విమర్శించారు. వాలంటీర్ వ్యవస్థను వైసీపీ కార్యకర్తలతో నింపి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారని, చెత్త పన్ను పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. గ్రామీణ ప్రజలకు ఉపయోగపడాల్సిన జల్ జీవన్ మిషన్ నిధులను కూడా సక్రమంగా వినియోగించలేదని అన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలకు సుమారు రూ. 4,100 కోట్ల నిధులు విడుదల చేయించామని అశోక్ బాబు తెలిపారు. గతంలో నిలిచిపోయిన ఇళ్లతో కలిపి 8 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమాల ద్వారా సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, గోకులం పథకం ద్వారా పశువుల షెడ్ల మంజూరు, వ్యవసాయ కుంటల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని, గిరిజన ప్రాంతాల్లో అడవి బాట కార్యక్రమం ద్వారా రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. గ్రామీణ స్వపరిపాలనను బలోపేతం చేస్తూ పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైసీపీ పాలనపై తమ అసంతృప్తిని ఓట్ల రూపంలో వ్యక్తం చేస్తున్నారని అశోక్ బాబు అన్నారు. ఓటమి భయంతోనే జగన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రజలు కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కూటమికి ఘన విజయం అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

తుపాన్ల వేళ గర్భిణీల సంరక్షణకు విస్తృత ఏర్పాట్లు

- ప్రసవ గడువు సమీపించిన 6,166 మంది గర్భిణులను ముందస్తుగా ఆసుపత్రులకు తరలింపు
- ఇప్పటికే 2,924 మంది ప్రసవం (47.42%)

అమరావతి, నవంబర్ 6 (జర్నలిస్ట్ ఫైల్): వరుస తుపాన్ల ప్రభావం నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రసవ గడువు సమీపించిన గర్భిణులను గుర్తించి ముందుగానే ఆసుపత్రులకు తరలించడంతో తుపాను సమయంలో రవాణా కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి తప్పింది. కుటుంబాల్లో ఆందోళన తగ్గడంతో పాటు, సకాలంలో ఆసుపత్రులకు చేరుకునేందుకు సమయం వృథా కాలేదు. మురసు, అర్నబ్ తుపాన్ల ప్రభావిత ప్రాంతాల్లో మొత్తం 6,166 మంది గర్భిణులను ముందస్తుగా ఆసుపత్రులకు తరలించగా, ఇప్పటికే 2,924 (47.42%) మంది ప్రసవించారు. వైద్య ఆరోగ్య శాఖ వద్ద నమోదైన వివరాల ఆధారంగా క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది సహాయంతో గర్భిణీలను వారి నివాసిత ప్రాంతాలకు దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు.

మురసు తుపాను ప్రభావిత జిల్లాల్లో 3,066 మంది తరలింపు : మురసు తుపాను ప్రభావిత 13 జిల్లాల్లో ప్రసవ గడువు సమీపించిన 3,066 మంది గర్భిణులను ముందస్తుగా ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ఇప్పటికే 1,705 మంది ప్రసవించారు (55.61%). తుపాను సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా గర్భిణులను సురక్షితంగా ఆసుపత్రుల్లో ఉంచి వైద్య సేవలు అందించారు. అత్యధికంగా చిత్తూరు, నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాలో ప్రసవాలు జరిగాయి.

అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 3,100 మంది తరలింపు: అర్నబ్ తుపాను ప్రభావిత 20 జిల్లాల్లో 3,100 మంది గర్భిణులను ముందస్తుగా ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 1,219 మంది ప్రసవించారు (39.32%). అక్టోబర్ 25 నుంచి నవంబర్ 8 వరకు ప్రసవ గడువు ఉన్న గర్భిణులను గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు చేపట్టారు. అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 124, కాకినాడ-110, మన్యం-108, ఎన్టీఆర్ జిల్లాలో 106 చొప్పున జరిగాయి.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి

ప్రసవ గడువు సమీపించిన వారితో పాటు, హైరిస్క్ గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నవారు, కవలల గర్భంతో ఉన్నవారిని ప్రత్యేకంగా గుర్తించారు. వైద్యాధికారుల పర్యవేక్షణలో వీరిని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రులకు తరలించారు.

రవాణాకు ప్రత్యేక ఏర్పాట్లు: గర్భిణులను ఆసుపత్రులకు తరలించేందుకు 108 అంబులెన్సులు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలతో పాటు వైద్యాధికారులు ఏర్పాటు చేసిన ఇతర వాహనాలను వినియోగించారు. అవసరమైన చోట ప్రైవేటు వాహనాల ద్వారా కూడా తరలింపు చేపట్టారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవానికి సిద్ధంగా ఉన్న 550 మంది గర్భిణులను ఆయా ఆసుపత్రులకు తరలించే చర్యలు చేపట్టారు.

మార్రిపూడి పీహెచ్‌సీలో సురక్షిత ప్రసవం: ప్రకాశం జిల్లా మార్రిపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నవంబర్ 4న సాయంత్రం 5.58 గంటలకు సాధారణ ప్రసవం జరిగింది. 2.5 కిలోల బరువున్న ఆడ శిశువు జన్మించింది. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. వారి ఆరోగ్య పరిస్థితి సాధారణంగా ఉందని వైద్యులు తెలిపారు.

సమన్వయంతో ముందస్తు చర్యలు: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గర్భిణుల గుర్తింపు, ముందస్తు తరలింపు, ఆసుపత్రుల్లో వైద్య సేవల కల్పనలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేశారని, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు వెల్లడించారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com